VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 13.07.2026
సంపుటి : 09 సంచిక : 34 , పేజీలు : 12 , వెల:రూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com



## కాళేశ్వరం అవినీతిపై చర్యలు ఎక్కడ?

# తెలంగాణ ఆర్ అండ్ బి శాఖను దేశంలోనే నంబర్‌వన్ గా తీర్చిదిద్దుతాం

- 6సార్లు ఎమ్మెల్యే, ఎంపీగా గెలిపించి రాజకీయ బిక్ష పెట్టిన నా గడ్డ రుణం అభివృద్ధి పనులతో తీర్చుకుంటా
- రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**వెలుతురు నల్లగొండ జిల్లా,నకిరేకల్ జూలై 12:**



రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖను అన్ని రంగాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.ఆదివారం మంత్రి నల్గొండ జిల్లా ,నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నార్కట్‌పల్లి మండల కేంద్రంలో 76 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నార్కట్‌పల్లి–మునుగోడు సేతుబంధన్ (సీఆర్ఐఎఫ్) రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మెరుగైన రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గారిని ఒప్పించి తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొదటి సారి సేతు బంధన్ పథకం కింద 103 కోట్లు మంజూరు చేయించి అందులో 76 కోట్లు ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం కేటాయించేలా చొరవ చూపినట్లు వెల్లడించారు.నార్కట్ పల్లి మండలం తన సొంత మండలమని,తనకు రాజకీయ బిక్ష పెట్టిన ఈ గడ్డ రుణం అభివృద్ధి పనులతో తీర్చుకుంటానని అన్నారు.

# హింసను ప్రేరేపించేలా రేవంత్ వ్యాఖ్యలు

- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు
- సీఎం వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం
- హిట్లర్ తనకు ఆదర్శమని గతంలో రేవంత్ చెప్పారని విమర్శ
- ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేక వ్యక్తిగత వ్యాఖ్యలంటూ ఆరోపణ
- నిన్న చేసిన వ్యాఖ్యలపై సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- షాబాద్ ఘటనపై తెలంగాణ సీఎం స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్య
- కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎంకు ఇప్పటికీ సరైన అవగాహన లేదని విమర్శ



- మేడిగడ్డ వద్ద నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- రైతులకు సాగునీరు అందించకుండా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆగ్రహం
- ఎల్లంపల్లి నీటి విషయంలో రాజకీయాలు చేస్తే రాష్ట్రానికి నష్టం తప్పదని హెచ్చరిక

# రైతులకు నీళ్లు అడిగితే ఆరోపణలా?

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు
- రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం
- అన్నదాతలకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్న
- తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ చేసిన సేవలేంటో చెప్పాలని సవాల్
- తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పాత్రపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు
- 1952, 1969 ఘటనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు



- మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలను గుర్తు చేసిన కేటీఆర్
- రైతుల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని స్పష్టం

# కాంగ్రెస్- బీఆర్ఎస్‌పై బండి సంజయ్ విమర్శలు

- కాళేశ్వరం అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు
- తెలంగాణ ప్రజలకు ఈ రెండు పార్టీలు "రక్తకన్నీరు-2" సినిమా చూపిస్తున్నాయని ఆయన ఆరోపించారు

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**



బీఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసి లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిందని, మరోవైపు ఎన్డీఎస్ఏ నివేదికలు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా ప్రాజెక్టును కోమాలోకి నెట్టిందని అన్నారు. ఈ రెండు పార్టీల తప్పిదాల వల్ల తెలంగాణ రైతులే నష్టపోతున్నారని పేర్కొన్నారు.డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం బ్యారేజీల యజమాని తెలంగాణ ప్రభుత్వమేనని, ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూసీ కమిటీలు కేవలం సలహాలు మాత్రమే ఇస్తాయని గుర్తు చేశారు. బ్యారేజీల మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.ఎన్డీఎస్ఏ ఇప్పటికే మూడు సార్లు నివేదికలు ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పునరుద్ధరణ పనులు చేపట్టాలని పదేపదే సూచించినా ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేసిందని నిలదీశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని గతంలో కాంగ్రెస్ ఆరోపించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం రూ.9 వేల కోట్ల అవినీతి విచారణకే పరిమితమైందని విమర్శించారు. విజిలెన్స్ నివేదిక వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఆ నివేదికను బహిర్గతం చేసే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు.కాళేశ్వరం మరమ్మతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు జాప్యం చేసిందని, ఇప్పుడు ప్రజల దృష్టి మళ్లించేందుకు బాధ్యతను కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి, నిర్లక్ష్యం, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల గోదావరి జలాలను తెలంగాణ ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.ఇప్పటికైనా రాజకీయాలు పక్కనపెట్టి ఎన్డీఎస్ఏ సిఫార్సులను యుద్ధ ప్రాతిపదికన అమలు చేసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ గురికాక తప్పదని బండి సంజయ్ హెచ్చరించారు.

# ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నేడు ఇక్రిశాట్‌లో సమీక్ష నిర్వహించనున్న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- వ్యవసాయ, ఉద్యాన విశ్వ విద్యాలయం, , ICRISAT, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, సిఆర్ఐడిఏ శాస్త్రవేత్తలు, ఐఎండి అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశం.
- ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధం



చేసిన మూడు కంటింజెన్సీ ప్రణాళికలను సమగ్రంగా పరిశీలించి తుది రూపు కు కసరత్తు : మంత్రి తుమ్మల.

- జూలై 15 నుంచి అమలు చేయనున్న తొలి కంటింజెన్సీ ప్రణాళికపై సూచనలు, మార్గదర్శకాలు జారీ చేయనున్న మంత్రి తుమ్మల.
- రైతులకు నష్టం కలగకుండా ముందస్తు గా చేపట్టాల్సిన చర్యలు కార్యక్రమాలు పై అధికారులకు దిశానిర్దేశం చేయనున్న మంత్రి తుమ్మల.

# ఎల్‌బీ స్టేడియంలో ప్రత్యేక పూజల్లో మహేష్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం ప్రాంగణంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆలయాన్ని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్ గారు, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలు సమాజంలో శాంతి, సామరస్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరికీ శ్రీ కనకదుర్గ అమ్మవారి కరుణాకటాక్షాలు లభించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# ఆలయాల అభివృద్ధిపై మంత్రి కొండా సురేఖ

- ఆలయాల్లో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు
- బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి
- వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి
- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకారానికి హాజరు
- ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- దేవాలయాల అభివృద్ధితో స్థానిక ఆర్థిక వ్యవస్థకు



ఊతమిస్తామని వెల్లడి

- గ్రేటర్ వరంగల్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు

# రైతులకు నీళ్లు అడిగితే ఆరోపణలా?



- జలసాధన కోసం బీఆర్ఎస్ చేసిన పోరాటాలను గుర్తు చేసిన మాజీ మంత్రి
- ఎండిపోతున్న పంట పొలాలకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శల వర్షం కురిపించిన కేటీఆర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్ర విమర్శలు చేశారు. రైతన్నల కోసం నీళ్లు అడిగితే తమపై ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్నదాతల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ వరుస పోస్టులు చేశారు.తెలంగాణను దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధికి ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ కోసం పోరాడిన యువతపై ఎన్‌కౌంటర్లు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పాలనను విమర్శించారు.1952లో ఏడుగురు యువకులను కాల్చిచంపింది కాంగ్రెస్ ప్రభుత్వమే కాదా? అని ప్రశ్నించిన కేటీఆర్, 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో 369 మందిపై తూటాల వర్షం కురిపించారని ఆరోపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ వేలాది మంది యువత ప్రాణత్యాగాలు చేశారని పేర్కొన్నారు.రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. రైతన్నల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తెలంగాణ సాధన కోసం నీళ్లలో నిప్పులు పుట్టించేలా జలసాధన పోరాటాలు చేశామని గుర్తు చేశారు.రాష్ట్రంలో ఎండిపోతున్న పంట పొలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఆ దిశగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఆలయాల అభివృద్ధిపై మంత్రి కొండా సురేఖ

- మేయర్ సీటు గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచన
- ప్రజలకు చేరువయ్యేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని ఆకాంక్ష
- వరంగల్‌లో కాంగ్రెస్ విజయానికి అందరూ సమన్వయంతో ముందుకు రావాలని పిలుపు

**।వరంగల్ వెలుతురు జూలై 12:**

దేవాలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇప్పటికే ఆలయాల్లో వేలాది కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఊతమివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఆదివారం వరంగల్ నగరంలో పర్యటించిన మంత్రి కొండా సురేఖ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు.బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆధ్యాత్మిక క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే కార్యాచరణ అమలులో ఉందని వెల్లడించారు.ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపైనా మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వరంగల్ మేయర్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి కొండా సురేఖ సూచించారు.

# తెలంగాణ ఆర్ అండ్ బి శాఖను...

(మొదటి పేజీ తరువాయి)

నల్లగొండ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రోడ్లు, సాగునీరు, వ్యవసాయం, తదితర రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎక్కువ స్థాయిలో ధాన్యం పండిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాష్ట్రంలోనే ధాన్యం అత్యధికంగా పండించిన జిల్లా నల్గొండ జిల్లా అని అన్నారు.నార్కట్‌పల్లి–మునుగోడు రహదారి అభివృద్ధి పనుల్లో స్థానిక రైతుల భూములకు




అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసి నార్కట్‌పల్లి ప్రాంతాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి అనే రెండు లక్ష్యాలతో ముందుకు సాగుతోందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. నార్కెట్ పల్లి మండలంలో 600 కోట్లతో హ్యాం రోడ్లను,4000 కోట్లతో రాష్ట్రంలో అన్ని రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు .2028లో ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం పూర్తి చేసి నార్కట్పల్లి మండల ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందిస్తామని చెప్పారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడారు.ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, సేతు బంధు సిఆర్ఐఎఫ్ చీఫ్ వసంత నాయక్ ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్ అండ్ బి సి.ఈ వసంత్ నాయక్ , ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు .

# హింసను ప్రేరేపించేలా రేవంత్ వ్యాఖ్యలు

- మేడిగడ్డపై సీఎం చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని స్పష్టీకరణ

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, కానీ రేవంత్‌రెడ్డి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో హిట్లర్ తనకు ఆదర్శమని రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పారని, ఇప్పుడు కూడా అదే తరహా భాషను ఉపయోగిస్తూ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అంశాలపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో సీఎం దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిన్న చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, వాటిపై రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.షాబాద్‌లో జరిగిన ఘటనపై పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించినప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమని హరీశ్‌రావు అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల అంశాల్లో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలపైనా హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 31 నెలలు పూర్తయినా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, పనితీరు, సాంకేతిక అంశాలపై రేవంత్‌రెడ్డికి ఇప్పటికీ సరైన అవగాహన రాలేదని విమర్శించారు. విశ్రాంత ఇంజినీర్లు, నీటిపారుదల శాఖ అధికారులు మేడిగడ్డ వద్ద నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.రైతులకు సాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. వాస్తవాలు మాట్లాడిన వారిని జైలుకు పంపిస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించిన వారిపై ఒత్తిడి తీసుకురావడం కంటే, వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.ఎల్లంపల్లి ప్రాజెక్టుపై హైదరాబాద్‌తో పాటు అనేక జిల్లాలు ఆధారపడి ఉన్నాయని హరీశ్‌రావు గుర్తు చేశారు. నీటి వంటి అత్యంత కీలకమైన అంశంలో రాజకీయాలు చేయడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకే నష్టం జరుగుతుందని హెచ్చరించారు. కరవు పరిస్థితులు మరింత జటిలం కాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించి రైతులకు అవసరమైన నీటిని అందించాలని డిమాండ్ చేసిన హరీశ్‌రావు, పంప్‌హౌస్ బటన్లు నొక్కడానికి బదులుగా ప్రభుత్వం ప్రతిపక్షాల కంఠం నొక్కడంపై దృష్టి పెట్టిందని విమర్శించారు. మేడిగడ్డ అంశంపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవాలని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించకుండా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నేడు ఇక్రిశాట్‌లో సమీక్ష నిర్వహించనున్న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, వెలుతురు జూలై 12:**

వానాకాలం–2026లో ఎల్–నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, ఉద్యాన విశ్వ విద్యాలయం, , ICRI-SAT, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, సిఆర్ఐడిఏ శాస్త్రవేత్తలు, ఐఎండి అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల విభాగం అధికారులతో నేడు ఇక్రిశాట్ లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, భారత వాతావరణ శాఖ (IMD), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ICAR–CRIDA శాస్త్రవేత్తలతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసిందిదాని ప్రకారంమూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళిక , జిల్లాల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయగా జూలై15 నుండిఅమలు చెయ్యాల్సిన ప్రణాళిక పై మరోమారు అధికారులు శాస్త్రవేత్తలతో మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. గత ఖరీఫ్ లో 1.40 కోట్ల ఎకరాలలో వివిధ పంటలు సాగవ్వగా.. అందులో 70 లక్షలు వరి సాగు అయినట్టు తెలిపారు. ఈ వానాకాలం ఎల్–నినో పరిస్థితులు ఉన్నప్పటికి ఇప్పటికే 60 లక్షల ఎకరాలలో వివిధ పంటలు వేసినట్టు వివరించారు. అయితే ఎల్నినో ప్రభావం ఇలాగే కొనసాగితే ఈ సీజన్లో వరి పంట 30–40లక్షల ఎకరాలలో సాగు అయ్యే అవకాశాలు ఉన్నట్టు అంచనా వేస్తున్నామని అన్నారు. అందుకనుగుణంగానే రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాలకు 3 దశలలో ప్రత్యామ్నాయ సాగు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.ఎల్–నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో విరామాలు ఏర్పడటం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ఆధారంగా చేసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక Contingency Plans సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు.

**వర్షపాతం పరిస్థితులపై రోజువారీ సమీక్ష... 20 జిల్లాలపై ప్రత్యేక దృష్టి**

జూలై 10 నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 20 జిల్లాల్లో వర్షపాతం లోటు నమోదైందన్నారు. లోటు జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

ప్రతి జిల్లాలో వర్షపాతం, సాగు పురోగతి, నేల తేమ, విత్తనాల లభ్యత, రైతుల అవసరాలపై రోజువారీ నివేదికలను విశ్లేషిస్తూ, అవసరమైన చోట వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు.

**శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కొంటున్నాం**

రాష్ట్రంలో Dynamic District Specific Response (DSR) అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా Real Time Rainfall Monitoring, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, భూగర్భ జలాల లభ్యత పైనిరంతర పర్యవే క్షన , పంటల పెరుగుదల, Climate Risk Analysis, Contingency Crop Planning, In-situ Moisture Conservation, Crop Diversification వంటి శాస్త్రీయ విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

**రైతులకు కీలక సూచనలు... వర్షాలు వచ్చిన తర్వాతే విత్తనాలు వేయాలి**

రైతులు కనీసం ★50 మిల్లీమీటర్ల వర్షపాతం వరుసగా రెండు నుంచి మూడు రోజులపాటు నమోదై భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని మంత్రి సూచించారు. వర్షాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, వేరుశెనగ, పెసలు, మినుములు, కందులు, సజ్జలు, జొన్నలు వంటి పంటలను సాగు చేయాలని కోరారు.

**విత్తనాలు, ఎరువుల కొరత ఉండదు... ముందుగానే నిల్వలు సిద్ధం**

రాష్ట్రంలో అవసరమైన విత్తనాలు, ఎరువులపై ఇప్పటికే సమగ్ర అంచనా పూర్తి చేశామని మంత్రి తెలిపారు. జూలై 15, జూలై 30, ఆగస్టు 15 పరిస్థితులకు అనుగుణంగా అవసరమయ్యే విత్తనాలను ముందుగానే సమీకరించామని, రైతులకు ఎలాంటి కొరత లేకుండా మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేస్తున్నామని చెప్పారు.

జిల్లా, మండల స్థాయిలో ఎరువులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లను తగినంతగా నిల్వ చేశామని, రైతు వేదికలు, వాట్సాప్ గ్రూపులు, డిజిటల్ ప్లాట్‌ఫారాలు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా రైతులకు నిరంతరం సాంకేతిక సూచనలు అందిస్తున్నామని తెలిపారు.

**'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై ప్రత్యేక అవగాహన**

వచ్చే మంగళవారం నిర్వహించే ★'రైతు నేస్తం'★ కార్యక్రమంలో ఎల్–నినో ప్రభావాలు, ప్రత్యామ్నాయ సాగు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలు, శాస్త్రీయ సాగు విధానాలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేలా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు."రైతు ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. ఎల్–నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి చర్య తీసుకుంటాం. ప్రతి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతుకు అండగా ఉంటుంది."

# కాళేశ్వరం అవినీతిపై చర్యలు ఎక్కడ?

- సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన కిషన్‌రెడ్డి
- కేసీఆర్ కుటుంబంతో రేవంత్‌కు రహస్య సంబంధాలున్నాయని ఆరోపణ
- కాళేశ్వరం అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న
- లక్ష కోట్ల రూపాయలు వసూలు చేస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని నిలదీత
- రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ సంస్థలు లేవా? అంటూ విమర్శ
- బీజేపీ నేతలను విమర్శించే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- నేటి నుంచి రెండు రోజుల పాటు 'సింగరేణి భరోసా యాత్ర' ప్రకటించిన కిషన్‌రెడ్డి
- హైదరాబాద్ బస్తీల్లో మౌలిక వసతులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వెల్లడి
- తాగునీరు, వీధిలైట్లు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్య
- పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డికి రహస్య సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబం నుంచి లక్ష కోట్ల రూపాయలు వసూలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన అక్రమాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కిషన్‌రెడ్డి నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ సంస్థలు లేవా? లేక విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందా? అని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులను విమర్శించే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.సోమవారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సింగరేణి భరోసా యాత్ర' చేపడుతున్నట్లు కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ యాత్రలో బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు.కాచిగూడ డివిజన్‌లో నిర్వహించిన పాదయాత్ర అనంతరం మాట్లాడిన కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి శనివారం, ఆదివారం బస్తీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో బస్తీలను సందర్శించిన సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత అనేక రహదారులు దెబ్బతిన్నాయని, వీధిలైట్లు పనిచేయక బస్తీలు చీకట్లో మగ్గుతున్నాయని చెప్పారు. పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోందని విమర్శించారు.తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. వర్షాకాలం వచ్చినప్పటికీ చివరి బస్తీలు, ఇళ్ల వరకు తాగునీరు అందడం లేదని, దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఇళ్ల నిర్మాణం, పెన్షన్ల మంజూరుపై కూడా ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాలాకాలమైనా అర్హులకు పెన్షన్లు అందడం లేదని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, నిరుద్యోగ యువతకు రూ.4,000 భృతి, యువతులకు స్కూటీలు, వివాహ సమయంలో తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.హైదరాబాద్ అభివృద్ధిపైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని కిషన్‌రెడ్డి విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హైటెక్ సిటీ అభివృద్ధికే పరిమితమైందని ఆరోపించారు. సికింద్రాబాద్, అంబర్‌పేట్, సనత్‌నగర్, గౌలిగూడ, ఓల్డ్‌సిటీ, ఖైరతాబాద్ వంటి ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అధికారులు వెంటనే స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# జాతీయ స్థాయి ఫిడే చెస్ టోర్నీలో మెరిసిన వేల్పుల అభిజ్ఞా






**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

హైదరాబాద్‌లో నిర్వహించిన మహావీర చక్ర కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా ఓపెన్ ర్యాపిడ్ ఫిడే రేటెడ్ చెస్ టోర్నమెంట్–2026లో యువ చెస్ క్రీడాకారిణి వేల్పుల అభిజ్ఞా ప్రతిభ కనబరిచింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 700 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో అభిజ్ఞా తొలిసారిగా జాతీయ స్థాయి ఫిడే రేటెడ్ పోటీల్లో బరిలోకి దిగింది. ఓపెన్ కేటగిరీలో పోటీ పడుతూ అండర్-7 విభాగంలో 9వ స్థానం సాధించి ప్రశంసలు అందుకుంది. అంతేకాకుండా AIM (అరీనా ఇంటర్నేషనల్ మాస్టర్) వంటి ఉన్నత రేటింగ్ కలిగిన ఆటగాళ్లతో తలపడుతూ విలువైన అనుభవాన్ని సొంతం చేసుకుంది.టోర్నీలో విజేతలకు మహావీర చక్ర అవార్డు గ్రహీత అమరుడు కల్నల్ సంతోష్ బాబు తల్లిదండ్రులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు కల్నల్ సంతోష్ బాబు దేశసేవను స్మరించుకుని ఆయన త్యాగాలను కొనియాడారు. అనంతరం మాట్లాడిన కల్నల్ సంతోష్ బాబు తండ్రి, "చెస్ కూడా ఒక యుద్ధం లాంటిదే. క్వీన్, రూక్ లేదా నైట్ వంటి కీలక పావులను కోల్పోయినా నిరాశ చెందకుండా, లక్ష్యంపై దృష్టి నిలిపి చివరకు చెక్‌మేట్ సాధించడమే నిజమైన విజయం" అని పేర్కొన్నారు.తనను ఫిడే రేటెడ్ టోర్నీలో పాల్గొనేలా ప్రోత్సహించి, నిరంతరం శిక్షణ అందించిన చెస్ కోచ్ రవిబాబుకు వేల్పుల అభిజ్ఞా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అభిజ్ఞా ప్రదర్శనపై తల్లిదండ్రులు, కోచ్‌లు, చెస్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# ఢిల్లీ పీఠాన్ని శాసించేలా.. బెంగళూరు వేదికగా 'బీసీ' రణభేరి!



- ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ
- వివిధ రాష్ట్రాల ఓబీసీ నేతలతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించిన జాజుల శ్రీనివాస్ గౌడ్
- రాజకీయ అధికారమే లక్ష్యం
- 29 రాష్ట్రాల నుండి హాజరుకానున్న వేలాది మంది ప్రతినిధులు
- మండల కమిషన్ సిఫారసుల దినోత్సవం సందర్భంగా 11వ మహాసభ నిర్వహణ

**బెంగళూరు, వెలుతురు జూలై 12:**

దేశవ్యాప్తంగా ఉన్న వెనుకబడిన తరగతుల (బీసీ) ప్రజలంతా రాజకీయ పార్టీలకతీతంగా ఐక్యం కావాలని, వారిని ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్ణాటక రాజధాని బెంగళూరులోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో మహాసభ విజయవంతం కోసం ఒక కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం రాష్ట్రీయ ఓబీసీ మహాసభ మహారాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ బాబన్ రావు తైవాడే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్ రావు వివిధ రాష్ట్రాల ఓబీసీ నేతలతో కలిసి మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు అధికారికంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఓబీసీ జాతీయ నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న 80 కోట్ల మంది బీసీల డిమాండ్ల పరిష్కారమే ధ్యేయంగా, రాజకీయ అధికారమే పరమావధిగా ఈ మహాసభను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మండల కమిషన్ సిఫారసులు అమలు చేస్తూ నిర్ణయించిన చారిత్రాత్మక రోజైన ఆగస్టు 7న ప్రతి సంవత్సరం తాము జాతీయ ఓబీసీ మహాసభను నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది నిర్వహిస్తున్న 11వ జాతీయ ఓబీసీ మహాసభను బెంగళూరు పట్టణంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ సిటీ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

ఈ ప్రతిష్టాత్మక సభకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి వేలాది మంది ఓబీసీ ప్రతినిధులు, మేధావులు హాజరవుతున్నారని, బీసీలంతా తరలివచ్చి ఈ మహాసభను విజయవంతం చేయడం ద్వారా తమ ఐక్యతను చాటి చెప్పాలని కోరారు.

బెంగళూరు ఓబీసీ నేత లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సచిన్ రాజోల్కర్, ప్రొఫెసర్ సంఘని మల్లేష్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమలతో పాటు ప్రముఖ నాయకులు రామకోటేశ్వరరావు, రావులకోల్ నరేష్ ప్రజాపతి, మేక వెంకటేశ్వరరావు, నారబోయిన రవి ముదిరాజ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని మహాసభ విజయవంతానికి సంఘీభావం ప్రకటించారు.

# బ్రాహ్మణ సమాజ ఐక్యతకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి: ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్ రావు





**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

హైదరాబాద్‌లోని మల్లాపూర్–VNR గార్డెన్‌లో బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వశిష్టా కల్యాణ వేదిక, రాజతోత్సవ వేడుకలు మరియు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ & పబ్లిక్ రిలేషన్స్) శ్రీ హార్కర వేణుగోపాల్ రావు గారు, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ శ్రీ బసవరాజు శ్రీనివాస్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ హార్కర వేణుగోపాల్ రావు గారు మాట్లాడుతూ, బ్రాహ్మణ సమాజ ఐక్యతను బలోపేతం చేయడంలో, సనాతన ధర్మ సంప్రదాయాలను పరిరక్షించడంలో, యువతకు వివాహ పరిచయ వేదికలను అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభ్యున్నతికి పరస్పర సహకారం, సామాజిక బాధ్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు.తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ శ్రీ బసవరాజు శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించి, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, పండితులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణ కుటుంబాలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన రిజిస్ట్రేషన్

- ఆక్షేపణల ప్రతులను ఇవ్వాలని ఈసీఐని కోరిన కవిత
- ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘానికి పార్టీ ప్రతినిధుల వినతి
- పేరు కేటాయించాక 1,000 అభ్యంతరాలు రావడంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- మరే పార్టీ పోలికలు లేని విభిన్నమైన పేరు.. చట్ట నిబంధనల ప్రకారం గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి




**హైదరాబాద్, వెలుతురు జూలై 12:**

తాము ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీకి అధికారిక గుర్తింపు ఇవ్వాలని, అలాగే తమ పార్టీ రిజిస్ట్రేషన్‌పై దాఖలైన ఆక్షేపణల ప్రతులను తమకు అందజేయాలని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత భారత ఎన్నికల సంఘాన్ని కోరారు. ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఈ మేరకు ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు. తొలుత ఏప్రిల్ 28న ఎన్నికల సంఘం తమ పార్టీ పేరును తాత్కాలికంగా కేటాయించిందని, ఆ తర్వాతే తాము తెలంగాణవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను ప్రారంభించామని లేఖలో పేర్కొన్నారు. అయితే, ఆ తర్వాత ఈ పేరుపై దాదాపు 1,000 కి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు తమకు సమాచారం అందిందని తెలిపారు.

అయితే, ఆ అభ్యంతరాలకు సంబంధించిన పూర్తి వివరాలను గానీ, పత్రాలను గానీ ఎన్నికల సంఘం తమతో పంచుకోలేదని పార్టీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదుల ప్రతులు తమకు అందకపోవడం వల్ల వాటిపై సమర్థవంతంగా సమాధానం ఇచ్చే అవకాశం లేకుండా పోయిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, తమకు వ్యక్తిగత విచారణ జరిపే ముందే, దాఖలైన అన్ని ఆక్షేపణల నకళ్లను, వాటికి సంబంధించిన ఆధారాలను తమకు అందజేయాలని ఈసీఐని కోరారు. అప్పుడే తాము చట్టబద్ధంగా వాటికి వివరణ ఇవ్వగలమని స్పష్టం చేశారు.

'తెలంగాణ రక్షణ సేన' అనేది పూర్తిగా ఒక విభిన్నమైన పేరని, ప్రస్తుత గుర్తింపు పొందిన లేదా నమోదైన ఏ ఇతర రాజకీయ పార్టీ పేరుతోనూ దీనికి పోలికలు లేవని లేఖలో వాదించారు. గతంలో ఎన్నికల సంఘం ఇటువంటి పోలికలు ఉన్న అనేక పార్టీల పేర్లను ఆమోదించిన దాఖలాలు ఉన్నాయని గుర్తుచేశారు. 'తెలంగాణ రాజ్య సమితి', 'తెలంగాణ రక్షణ సమితి' వంటి పేర్లను ఈసీఐ గతంలో ఆమోదించినందున, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 29A ప్రకారం తమ పార్టీ రిజిస్ట్రేషన్‌ను కూడా తక్షణమే ఆమోదించి, గుర్తింపు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

# నేడే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి పర్యటన

- రూ.1,775.51 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు శంకుస్థాపనలు

**హైదరాబాద్, వెలుతురు జూలై 12:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,775.51 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారుల విస్తరణ, మరమ్మత్తు పనులకు రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

పర్యటన సాగనుందిలా:–

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) ఫేజ్–1 కింద చేపట్టనున్న నాలుగు ప్యాకేజీల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు నారాయణపేట జిల్లా మక్తల్‌లో రూ.573 కోట్లతో మహబూబ్‌నగర్–1 ప్యాకేజీ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని గద్వాల–రాయచూర్ రహదారిపై రూ.339.39 కోట్లతో మహబూబ్‌నగర్–2 ప్యాకేజీ పనులకు భూమి పూజ చేయనున్నారు.మధ్యాహ్నం వనపర్తిలోని జడ్చర్ల రోడ్డులో రూ.359.09 కోట్లతో వనపర్తి–2 ప్యాకేజీ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎల్లూరు గ్రామం వద్ద కొల్లాపూర్–మొలచింతలపల్లి మార్గంలో రూ.504.03 కోట్లతో వనపర్తి–1 ప్యాకేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

# దేశంలోనే తొలిసారి జిల్లా పంచాయతీ చైర్మన్లను అడ్మినిస్ట్రేటర్లుగా నియమించిన యూపీ ప్రభుత్వం

**లక్నో, వెలుతురు జూలై 12:**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కానున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఒక అపూర్వమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 75 జిల్లాల పంచాయతీ చైర్మన్ల పదవీ కాలం ముగిసినప్పటికీ, వారిని ఆయా జిల్లాల పంచాయతీలకు 'అడ్మినిస్ట్రేటర్లు' (పాలనాధికారులు) గా నియమిస్తూ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోనే ఈ తరహా నియామకం జరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లా పంచాయతీ చైర్మన్ల ఐదేళ్ల పదవీ కాలం జూలై 11 శనివారంతో ముగిసిపోతుండటంతో, పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా జూలై 12 నుండి వర్తించేలా ప్రభుత్వం ఈ తాజా మధ్యంతర ఆదేశాలను వెలువరించింది.

ఈ ఉత్తర్వుల ప్రకారం.. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల బోర్డులు కొలువుదీరే వరకు లేదా గరిష్టంగా ఆరు నెలల కాలం వరకు ప్రస్తుత చైర్మన్లే అడ్మినిస్ట్రేటర్లుగా కొనసాగుతారు. ఆయా జిల్లాల కలెక్టర్లు (డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్లు) వీరిని అడ్మినిస్ట్రేటర్లుగా నియమించే ప్రక్రియను పూర్తి చేస్తారు. అయితే, ఈ మధ్యంతర కాలంలో వారికి పరిమిత అధికారాలు మాత్రమే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. వారు కేవలం రోజువారీ రొటీన్ పరిపాలనా విధులను మాత్రమే పర్యవేక్షించాల్సి ఉంటుంది కానీ, ఎటువంటి కొత్త విధానపరమైన నిర్ణయాలు తీసుకోకూడదు. అత్యవసర లేదా ప్రత్యేక పరిస్థితుల్లో ఏదైనా పాలసీ ప్రతిపాదనలు ఉంటే, వాటిని సంబంధిత జిల్లా కలెక్టర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపాల్సి ఉంటుందని ఆదేశాల్లో పేర్కొన్నారు.

మరోవైపు, ఉత్తరప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం కింద ప్రభుత్వం తీసుకుంటున్న ఈ తరహా చర్యలపై న్యాయస్థానంలో చట్టపరమైన సవాలు ఎదురైంది. గతంలో గ్రామ పంచాయతీల గడువు ముగిసిన తర్వాత గ్రామ ప్రధాన్‌లను అడ్మినిస్ట్రేటర్లుగా నియమిస్తూ మే 25న జారీ చేసిన ఉత్తర్వుల రాజ్యాంగబద్ధతను అలహాబాద్ హైకోర్టు శుక్రవారం తీవ్రంగా ప్రశ్నించింది.

లక్నో బెంచ్‌కు చెందిన జస్టిస్ రాజన్ రాయ్, జస్టిస్ మంజరి శుక్లాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ వివరణను కోరుతూ, తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది. ఒకవైపు కోర్టులో చట్టపరమైన సవాళ్లు నడుస్తున్నప్పటికీ, గడువు ముగిసే సరిగ్గా ఒక్క రోజు ముందు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం జిల్లా పంచాయతీ చైర్మన్ల విషయంలో ఈ సంచలన నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు దేశవ్యాప్త పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# మనసులో ఉషస్సు ఉంటే.. ప్రతి రోజూ ఉగాదే!

మానవ జీవితం అనేది కేవలం కాలగమనంలో సాగిపోయే కొన్ని సంవత్సరాల సంకలనం మాత్రమే కాదు. అది అంతర్గత చైతన్యంతో, అంతులేని భావోద్వేగాలతో, నిరంతర అన్వేషణలతో కూడిన ఒక సుదీర్ఘ ప్రయాణం. ఈ భూమిపై నా ఉనికి ఏమిటి? నేను ఎక్కడి నుండి వచ్చాను, ఎటు వైపు వెళ్తున్నాను? అనే ప్రాథమిక ప్రశ్న ప్రతి మనిషి హృదయంలోనూ ఏదో ఒక దశలో ఉదయిస్తూనే ఉంటుంది. ఒక జననం నుండి మరణం వరకూ సాగే ఈ సుదీర్ఘ జీవన ప్రవంతిలో, ప్రతి మలుపూ ఒక కొత్త అనుభవాన్ని, ప్రతి క్షణమూ ఒక కొత్త పాఠాన్ని నేర్పుతుంది. అయితే ఈ ప్రశ్నలకు ఒకే ఒక ఖచ్చితమైన సమాధానాన్ని వెతకడం సాధ్యం కాదు. ఎందుకంటే జీవితం అనేది ఒక్కొక్కరికి ఒక్కోలా అనుభవంలోకి వస్తుంది. కొందరికి ఇది ఒక అందమైన కల, మరికొందరికి ఇది ఒక నిరంతర పోరాటం. కానీ లోతుగా ఆలోచిస్తే, జీవితం ఎంత చిన్నదో, అంతలోనే అది ఎంత గొప్పదో, ఎంత విశాలమైనదో మనకు సులభంగానే అర్థమవుతుంది.

జీవితమే ఓ చిన్న మజిలీ అనే మాట సమాజంలో తరచుగా వినిపిస్తూ ఉంటుంది. ఈ చిన్న వాక్యంలో అనంతమైన సత్యం, తాత్వికత దాగి ఉన్నాయి. మనం ఈ ప్రపంచంలో ఎంత గొప్ప కీర్తి ప్రతిష్టలను సంపాదించినా, ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత సంపదను కూడబెట్టినా, చివరకు ఇదంతా ఒక తాత్కాలికమైన మజిలీ మాత్రమే అనే నిజాన్ని మార్చలేము. విశ్వ కాలమానంతో పోల్చితే మానవ ఆయుష్షు చాలా స్వల్పమైనది. కానీ, ఈ చిన్న మజిలీలోనే మనిషి సాధించగలిగేవి, అనుభవించగలిగేవి అనంతమైన అవకాశాల రూపంలో దాగి ఉంటాయి. ఈ పరిమిత కాలంలోనే మనం ఎంతమందికి సహాయం చేశాం, ఎంత ప్రేమను పంచాం, సమాజంలో ఎలాంటి ముద్రను వేసాం అనేదే మన జీవితానికి నిజమైన విలువను ఇస్తుంది.మనిషి భూమిపై అడుగుపెట్టిన క్షణం నుండే అతని ప్రయాణం నిరంతరాయంగా మొదలవుతుంది. బాల్యంలో ఎలాంటి కపటమూ లేని ఆటపాటలతో, అమాయకత్వంతో గడిచిపోయే రోజులు ఒకటైతే, యవ్వనంలోకి వచ్చేసరికి ఆశయాలు, ఆశలు, ఆకాంక్షలు మనిషిని నడిపిస్తాయి. ఆ తర్వాత మధ్య వయస్సు బాధ్యతలతో, వృద్ధాప్యం అనుభవాల భారంతో సాగుతుంది. ఇలా ప్రతి దశలోనూ మనిషి శారీరకంగా, మానసికంగా ముందుకే సాగుతూ ఉంటాడు కానీ ఎక్కడా ఆగిపోడు. అయితే ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరికీ ఎదురయ్యే అతి పెద్ద నిశ్శబ్దం, భయం మరణం. ఈ లోకాన్ని, మనకు ఇష్టమైన వారిని వదిలిపోవాలనే ఆలోచన ఎవరికైనా భయంకరంగా, బాధాకరంగా అనిపించడం సహజం. కానీ, అది ప్రకృతి యొక్క అత్యంత నిష్పాక్షికమైన నియమం.చనిపోతామనే భయంతో క్షణక్షణాన్ని నరకం చేసుకోవడం కాదు, మనం బతికున్న ప్రతి క్షణాన్ని ఎంత అర్థవంతంగా, ఎంత సంతోషంగా జీవించామనేదే అసలైన జీవిత సారాంశం. మరణం అనేది ముగింపు మాత్రమే, కానీ జీవితం అనేది ప్రస్తుత క్షణంలో బతకడం. ఆ ప్రస్తుతాన్ని గౌరవించినప్పుడే మానవ జన్మ సార్థకమవుతుంది.కలలు కనడం అనేది మానవ నైజంలోనే ఒక సహజ లక్షణం. ఊహ తెలియని బాల్యం నుండి వృద్ధాప్యం వరకు ప్రతి ఒక్కరూ తమ హృదయంలో ఏదో ఒక కీర్తిని, ఒక ఉన్నతమైన స్థానాన్ని లేదా ఒక గమ్యాన్ని కలగంటూనే ఉంటారు. ఈ కలలే మనిషిని నిరంతరం క్రియాశీలంగా ఉంచుతాయి.



అయితే, కేవలం కలలు కనడం మాత్రమే సరిపోదు. ఆ కలలు నిజమయ్యే మార్గంలో ఎదురయ్యే ఓటములను తట్టుకుని, ఆ కలలను మళ్ళీ మళ్ళీ మోయగలగడమే నిజమైన మానసిక శక్తి. జీవితంలో ఒక్కసారి విఫలమైతే నిరాశతో వెనుదిరగడం చాలా సులభం. సమాజంలో చాలామంది అలా వెనకడుగు వేస్తూ ఉంటారు. కానీ ప్రతిసారీ కిందపడినప్పుడు అంతే వేగంతో పైకి లేచి నిలబడి, తిరిగి ఆ కలను హృదయానికి హత్తుకుని మొండిగా ముందుకు సాగడమే సాధారణ మనిషిని సైతం ఒక అసాధారణ వ్యక్తిగా, గొప్పవానిగా మారుస్తుంది.ఈ క్రమంలో కీర్తి అనేది కేవలం ఒక బాహ్య గమ్యం మాత్రమే కాదు. అది మన తీవ్రమైన ఊహల నుండి పుట్టిన ఒక నూతన జననం. మనం భవిష్యత్తులో ఏమి కావాలని బలంగా కలగంటామో, ఆ అంతర్గత ఊహే మనలను ఆ దిశగా అడుగులు వేయిస్తుంది. అందుకే గమ్యం అనేది బయట ఎక్కడో భౌతికంగా లేదు, అది మన ఆలోచనలలోనే మొదట మొలకెత్తుతుంది. మన ఆలోచనలు ఎంత బలంగా ఉంటే, మన గమ్యం అంత స్పష్టంగా కనిపిస్తుంది.అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, గమ్యం చేరడం కంటే, ఆ గమ్యం వైపు మనం సాగించే శోధనలోనే, ఆ ప్రయాణంలోనే అసలైన అందం, ఆనందం దాగి ఉన్నాయి. ప్రతి కొత్త అన్వేషణ, ప్రతి నిరంతర ప్రయత్నం, ఆ ప్రయత్నంలో మనం చేసే ప్రతి తప్పు, ఆ తప్పుల నుండి నేర్చుకునే ప్రతి పాఠం ఇవన్నీ కలిసి మన వ్యక్తిత్వాన్ని, మన గమనాన్ని ఒక క్రమ పద్ధతిలో రూపొందిస్తాయి.గమ్యం చేరిన ఆ ఒక్క క్షణం మనకు ఎనలేని సంతోషాన్ని ఇవ్వవచ్చు, కానీ ఆ గమ్యం వైపు సాగే సుదీర్ఘ ప్రయాణంలో మనం వ్యక్తిగా ఎంత నేర్చుకున్నాం, ఎంత అనుభవించాం, మానసికంగా ఎంతగా ఎదుగుతూ వచ్చాం అనేదే జీవితానికి నిజమైన, శాశ్వతమైన అర్థాన్ని ఇస్తుంది.

అందుకే ప్రయాణమే ప్రాణం అని చెప్పడం ఎంతైనా సముచితం. ఎందుకంటే గెలుపు అనేది కేవలం ఒక మైలురాయి లేదా ఒక క్షణం మాత్రమే. కానీ ఆ గెలుపు సాధించడం కోసం మనం ఎదుర్కొన్న ప్రతి మలుపు, ప్రతి అడ్డంకి, ప్రతి కఠినమైన సవాలు ఇవన్నీ కలిసి మనలను మానసికంగా దృఢంగా మార్చి, సమాజంలో నిజమైన విజేతలుగా తీర్చిదిద్దుతాయి. జీవితంలో ఎలాంటి మలుపులు, సవాళ్లు లేకపోతే అది ఎంతో ఏకపక్షంగా, ఎటువంటి రుచి, ఉత్సాహం లేకుండా సాదాసీదాగా సాగిపోతుంది. ప్రతి మలుపూ మనిషికి ఒక కొత్త అనుభవాన్ని, ప్రపంచాన్ని చూసే ఒక కొత్త దృక్పథాన్ని అందిస్తుంది. కష్టాలు వచ్చినప్పుడే సుఖం విలువ తెలిసినట్లు, సవాళ్లు ఎదురైనప్పుడే మనలోని నిజమైన సామర్థ్యం బయటపడుతుంది.భారతీయ సంస్కృతిలో, ముఖ్యంగా తెలుగు వారి సాంప్రదాయంలో ఉగాది అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. అది ప్రకృతిలో వచ్చే మార్పులకు, కొత్తదనానికి, ఒక రకమైన పునర్జన్మకు సంకేతం. చెట్లు చిగురించి, కోయిలలు కూస్తూ ప్రకృతి అంతా కొత్త శోభను సంతరించుకునే సమయమది. ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో వచ్చే ఉగాది మనకు ఒక కొత్త ఆరంభాన్ని, కొత్త ఆశలను అందిస్తుంది. కానీ తాత్విక కోణంలో ఆలోచిస్తే, నిజమైన ఉగాది అనేది సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే క్యాలెండర్ ప్రకారం రావాల్సిన అవసరం లేదు. మన మనసులో నిరంతరం ఒక ఉషస్సు ఉంటే, అంటే ప్రతి ఉదయం నిద్ర లేవగానే ఒక కొత్త ఆశతో, ఒక కొత్త ఉత్సాహంతో, ఏదో సాధించాలనే సంకల్పంతో లేచి నిలబడగలిగితే, మనకు ప్రతి రోజూ ఒక కొత్త ఉగాదే అవుతుంది.

ఇది కేవలం కవుల ఊహల నుండి వచ్చిన కవితాత్మక భావన కాదు, ఇది ఒక అద్భుతమైన జీవన విధానం. నిన్నటి రోజున జరిగిన పరాజయాలను, వైఫల్యాలను, బాధలను నిన్నటితోనే వదిలేసి, ఈరోజు దొరికిన జీవితాన్ని ఒక కొత్త అవకాశంగా భావించి ప్రయాణాన్ని ప్రారంభించే మానసిక పరిణతి ఉన్నవారికి, ప్రతి సూర్యోదయం ప్రకృతి ప్రసాదించిన ఒక గొప్ప వరంగా మారుతుంది.ఈ సృష్టిలో ప్రతి మనిషిలోనూ ఏదో ఒక ప్రత్యేకమైన ప్రతిభ, నైపుణ్యం దాగి ఉంటాయి. మనిషి తనలో ఉన్న ఆ ప్రతిభను గుర్తించి, దానిని ఎటువంటి స్వార్థం లేకుండా, నిజాయితీగా సమాజం ముందు ప్రదర్శించినప్పుడు, అది కేవలం ఒక సాధారణ విజయం పొంది మిగిలిపోదు. అదొక ప్రభంజనంగా మారి సమాజాన్ని సైతం ప్రభావితం చేస్తుంది.మనలో దాగి ఉన్న ఆంతరంగిక శక్తిని మనం సరైన సమయంలో గుర్తించి, దానిని ఒక మంచి మార్గంలో, సరైన దిశలో ఉపయోగించినప్పుడు, మనం సాధించే విజయం మనకు మాత్రమే కాకుండా, మన చుట్టూ ఉన్న వందలాది మందికి, భావి తరాల సమాజానికి ఒక గొప్ప స్ఫూర్తిని ఇస్తుంది.మొత్తంగా ఈ జీవన విశ్లేషణను పరిశీలిస్తే, ఈ భావనలన్నీ మనకు అందించే సందేశం ఒక్కటే. జీవితం కాలం పరంగా చాలా చిన్నదైనప్పటికీ, దానిని ఎంత ఉన్నతంగా, ఎంత అద్భుతంగా జీవించాలో నిర్ణయించే పూర్తి స్వేచ్ఛ, శక్తి కేవలం మన చేతుల్లోనే ఉన్నాయి. మన హృదయంలోని కలలను ఎక్కడా వదలకుండా, గమ్యంతో పాటు గమ్యం వైపు సాగే ప్రయాణాన్ని కూడా మనసారా ప్రేమిస్తూ, ప్రతి కొత్త రోజునూ ఒక ఆశావహ దృక్పథంతో స్వీకరిస్తూ, మనలోని ప్రతిభను లోకానికి నిజాయితీగా ప్రదర్శిస్తే చాలు. అప్పుడు ఈ మానవ జీవితం అనేది కేవలం ఒక తాత్కాలిక మజిలీగా ముగిసిపోకుండా, కాలం ఉన్నంతవరకూ గుర్తుండిపోయే ఒక అద్భుతమైన, చిరస్మరణీయమైన అనుభవంగా మిగిలిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher,
9490754169

# స్వరాలు మౌనమైనా...జానకమ్మ గానం శాశ్వతం..

భారతీయ సినీ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే గాత్రాలలో ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి గాత్రం ఒకటి. తరతరాల సంగీతాభిమానులను తన మధుర గానంతో అలరించిన ఈ మహోన్నత కళాకారిణి మరణం భారతీయ సంగీత ప్రపంచానికే కాకుండా తెలుగు ప్రజలకు, ముఖ్యంగా తెలంగాణ సమాజానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆమె మరణవార్త తెలిసిన వెంటనే దేశవ్యాప్తంగా సంగీతాభిమానులు, సినీ ప్రముఖులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక రంగానికి చెందినవారు ఆమెకు ఘన నివాళులు అర్పించారు. "జానకమ్మ" అని ప్రేమతో పిలుచుకునే ఈ గానకోకిల ఇక లేరనే విషయం సంగీత ప్రపంచం జీర్ణించుకోలేని వాస్తవంగా మారింది.ఎస్. జానకి పూర్తి పేరు శిష్ట్ల శ్రీరామమూర్తి జానకి. చిన్ననాటి నుంచే సంగీతంపై అపారమైన ఆసక్తి పెంచుకున్న ఆమె, తన అసాధారణ గాత్ర మాధుర్యంతో సినీ నేపథ్య గాయనిగా అరుదైన స్థాయిని అందుకున్నారు. దాదాపు ఆరు దశాబ్దాలపాటు సాగిన ఆమె సంగీత ప్రస్థానం భారతీయ సినీ సంగీత చరిత్రలో ఒక స్వర్ణయుగంగా నిలిచిపోతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, ఒడియా, బెంగాలీ, మరాఠీ, తుళు తదితర భారతీయ భాషల్లో సుమారు యాభై వేలకుపైగా పాటలు ఆలపించి ప్రపంచ రికార్డులకు సరితూగే ఘనతను సాధించారు. భాష ఏదైనా, భావం ఏదైనా, పాత్ర ఏదైనా తన గాత్రంతో ఆ పాత్రలో ప్రాణం పోసే అరుదైన సామర్థ్యం ఆమె సొంతం.ఎస్. జానకి గాత్రంలో ప్రత్యేకత కేవలం మాధుర్యమే కాదు; భావవ్యక్తీకరణలోని సహజత్వం కూడా. పసిపాప నవ్వును, యువతి ప్రేమను, తల్లి మమతను, భక్తుని భక్తిని, వృద్ధురాలి బాధను – ఇలా ప్రతి భావాన్నీ తన స్వరంలో ఆవిష్కరించే అసాధారణ ప్రతిభ ఆమెకు దక్కింది. ఒకే గాయని అనేక పాత్రలకు తన స్వరాన్ని మార్చుకుంటూ ప్రేక్షకులను, శ్రోతలను కట్టిపడేయడం చాలా అరుదైన విషయం. అందుకే ఆమెను గాన సరస్వతి, గానకోకిల, సంగీత మణిహారం వంటి బిరుదులతో అభిమానులు సత్కరించారు.తెలుగు సినీ సంగీతానికి ఎస్. జానకి చేసిన సేవలు అపారమైనవి. ఘంటసాల, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, పి. బి. శ్రీనివాస్, యేసుదాస్ వంటి మహా గాయకులతో కలిసి వేలాది పాటలు ఆలపించి సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. సంగీత దర్శకులు ఘంటసాల, కె.వి. మహదేవన్, చక్రవర్తి, ఇళయరాజా, ఎం. ఎం. కీరవాణి, రాజ్–కోటి, దేవి శ్రీ ప్రసాద్ తదితర తరతరాల సంగీత దర్శకులతో కలిసి పనిచేస్తూ ప్రతి కాలానికి తగ్గట్టుగా తన గాత్రాన్ని మలుచుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. సంగీతం ఎంత మారినా, కాలం ఎంత మారినా, జానకమ్మ గాత్రానికి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు.జాతీయ స్థాయిలోనూ ఎస్. జానకి ఎన్నో అత్యున్నత గౌరవాలను అందుకున్నారు. నాలుగు సార్లు జాతీయ ఉత్తమ నేపథ్య గాయనిగా పురస్కారాన్ని అందుకోవడంతో పాటు అనేక రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నంది, తమిళనాడు రాష్ట్ర పురస్కారాలు, కర్ణాటక, కేరళ రాష్ట్ర అవార్డులు సహా వందలాది సత్కారాలు అందుకున్నారు. అయినప్పటికీ అవార్డుల కంటే సంగీతమే తనకు ముఖ్యమని భావించిన ఆమె అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు.ఎస్. జానకి వ్యక్తిత్వంలో కళాపట్ల ఉన్న నిబద్ధత ఎంత గొప్పదో, సామాజిక స్పృహ కూడా అంతే గొప్పది. 2013లో భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆమె మర్యాదపూర్వకంగా తిరస్కరించారు. దక్షిణాది కళాకారులకు సరైన సమయంలో తగిన గుర్తింపు లభించడం లేదనే తన అభిప్రాయాన్ని ఎంతో గౌరవప్రదంగా వ్యక్తం చేశారు. వ్యక్తిగత గౌరవం కంటే కళాకారుల ఆత్మగౌరవానికే ప్రాధాన్యం ఇచ్చిన ఆమె నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తనకు వచ్చిన గౌరవాన్ని కంటే కళాకారుల సమాన గౌరవమే ముఖ్యమని చెప్పిన ఆమె ధైర్యసాహసాలు ఎందరికో ఆదర్శంగా నిలిచాయి.తెలంగాణ ప్రజలకు ఎస్. జానకితో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆమె తండ్రి ఉద్యోగరీత్యా అప్పటి కరీంనగర్ జిల్లాలో కొంతకాలం నివసించడం, వారి కుటుంబ మూలాలు నేటి రాజన్న సిరిసిల్ల ప్రాంతంతో అనుబంధం కలిగి ఉండడం తెలంగాణ ప్రజలకు గర్వకారణంగా భావించబడుతుంది. అందుకే ఆమెను తమ ఇంటి ఆడపడుచుగా, తమ ప్రాంతపు గానకోకిలగా తెలంగాణ ప్రజలు అభిమానించారు. ఆమె మరణవార్తతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు ఆమెకు ఘన నివాళులు అర్పిస్తూ, భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.జానకమ్మ ఆలపించిన పాటలు కేవలం వినోదానికే పరిమితం కాలేదు. ఆమె గాత్రంలో జీవితం ఉంది, భావోద్వేగం ఉంది, సంస్కృతి ఉంది, మానవీయత ఉంది. ప్రేమ, భక్తి, జానపదం, శృంగారం, విషాదం, ఉత్సాహం, దేశభక్తి – ఏ రకమైన పాట అయినా ఆమె గాత్రంలో కొత్త జీవం పొందేది. అందుకే ఆమె పాడిన వేలాది పాటలు ఇప్పటికీ రేడియోలో, టెలివిజన్‌లో, డిజిటల్ వేదికల్లో, సంగీత కార్యక్రమాల్లో నిరంతరం వినిపిస్తూ కొత్త తరాలను కూడా అలరిస్తూనే ఉన్నాయి.సంగీతం అనేది కేవలం స్వరాల సమాహారం మాత్రమే కాదని, అది భావాలను మనసుకు చేర్చే పవిత్రమైన సాధనమని ఎస్. జానకి తన గానంతో నిరూపించారు. ఆమె స్వరంలో ఉండే ఆ మాధుర్యం ఎన్నో కుటుంబాల సంతోషాల్లో, పండుగల్లో, ప్రేమ కథల్లో, భక్తి కార్యక్రమాల్లో, జీవిత జ్ఞాపకాలలో భాగమైంది. ఒక గాయని తన గాత్రంతో కోట్లాది మంది జీవితాల్లో భాగం కావడం చాలా అరుదైన విషయం. ఆ అరుదైన గౌరవాన్ని ఎస్. జానకి సంపాదించుకున్నారు.సినీ సంగీత రంగంలోకి వచ్చిన అనేకమంది యువ గాయకులు, గాయనులు జానకమ్మను తమ ఆదర్శంగా పేర్కొంటూ ఉంటారు. గానంలో స్పష్టమైన ఉచ్చారణ, భావప్రకటన, శ్రుతి–లయలపై పట్టుదల, క్రమశిక్షణ, వినయం – ఇవన్నీ ఆమె వ్యక్తిత్వంలోని గొప్ప లక్షణాలు. అందుకే ఆమె కేవలం గొప్ప గాయని మాత్రమే కాదు, సంగీత సాధకులకు ఒక పాఠశాలగా నిలిచారు. ఆమె జీవితం కళాకారులకు అంకితభావం అంటే ఏమిటో చూపించిన ఉత్తమ ఉదాహరణ.ఎస్. జానకి మరణం దక్షిణ భారత సినీ సంగీతానికి, ముఖ్యంగా తెలుగు పాటకు తీరని లోటు. ఒక మహా గాత్రం మూగబోయినా, ఆమె ఆలపించిన పాటలు ఎన్నటికీ మూగబడవు. కాలం మారినా, తరాలు మారినా, ఆమె స్వరం సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా మార్మోగుతూనే ఉంటుంది. ఆమె పాటలు భవిష్యత్ తరాలకు సంగీత సంపదగా నిలుస్తాయి. భారతీయ సంగీత వారసత్వంలో ఆమె పేరు ఎప్పటికీ చెరగని అక్షరాలతో లిఖించబడి ఉంటుంది.ఈ విషాద సమయంలో ఎస్. జానకి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి తెలంగాణ సమాజం తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది. కోట్లాది మంది అభిమానుల ప్రేమను సంపాదించిన జానకమ్మ శారీరకంగా మన మధ్య లేకపోయినా, ఆమె గానం యుగయుగాల పాటు సంగీత ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ఆమె జీవితం, సంగీతం, విలువలు, కళాపట్ల అంకితభావం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.గానకోకిల ఎస్. జానకి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని తెలంగాణ ప్రజలతో పాటు యావత్ భారతదేశ సంగీతాభిమానులు ప్రార్థిస్తున్నారు. జానకమ్మ వంటి మహా గాయనులు శరీరంగా దూరమైనా, వారి స్వరం ఎన్నటికీ మరణించదు. సంగీతం ఉన్నంతకాలం, తెలుగు పాట ఉన్నంతకాలం, భారతీయ సంస్కృతి ఉన్నంతకాలం ఎస్. జానకి పేరు చిరస్థాయిగా వెలుగొందుతూనే ఉంటుంది. అదే ఆమెకు భారతదేశం అందించే నిజమైన నివాళి.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# సమరసత సమాజ నిర్మాణంతోనే వివక్షకు చరమగీతం : అప్పాల ప్రసాద్



- హిందూ ధర్మంలో అస్పృశ్యతకు స్థానం లేదు
- కులాల మధ్య చిచ్చుపెట్టే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- శంకర్ పల్లి సామాజిక సమరసత ఖండ సమావేశంలో అఖిల భారత కన్వీనర్ పిలుపు

**శంకర్ పల్లి, వెలుతురు జూలై 12:**

సమాజంలో వివక్షత, అంటరానితనం లేని సమరసత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ గారు పిలుపునిచ్చారు. శంకర్ పల్లిలోని డి.ఎమ్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సామాజిక సమరసత శంకర్ పల్లి ఖండ సమావేశం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అప్పాల ప్రసాద్ గారు మాట్లాడుతూ.. హిందూ ధర్మంలో అస్పృశ్యతకు, వివక్షకు ఎక్కడా స్థానం లేదని స్పష్టం చేశారు. కాలక్రమేణా సమాజంలో వచ్చి చేరిన దురాచారాలు మాయని మచ్చగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమాజంలోని అన్ని కులాల్లో జన్మించిన మహానుభావులు, సంస్కర్తలు చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని, నేటి తరం కుల అసమానతలను పూర్తిగా తొలగించేందుకు నడుం బిగించాలని కోరారు.కొన్ని శక్తులు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ, కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి వారి పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సామూహిక వివాహాల వంటి కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు.

**నూతన బాధ్యతల కేటాయింపు**

ఈ సమావేశం సందర్భంగా సంస్థ బలోపేతానికి మరియు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడానికి గానూ పలువురికి ముఖ్యమైన బాధ్యతలను కేటాయించారు. విభాగ్ ప్రముఖులు, జిల్లా గౌరవ అధ్యక్షులు, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు మరియు విద్యార్థి విభాగం బాధ్యతలను దామోదర్ రెడ్డి, ఈశ్వరయ్య, రాజేందర్, సంతోష్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, కృష్ణ, బాలరాజు, శివ తదితరులకు అప్పగించారు. ఈ సామాజిక సమరసత సమావేశంలో దామోదర్ రెడ్డి, నాగిరెడ్డి, నరసింహ, ఈశ్వరయ్య, రాజేందర్, సంతోష్ కుమార్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, హరి శంకర్, శ్రీనివాస్, ఆకాష్, అభినందన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, కవ్వగూడెం శ్రీను తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోల్నాకలో కిషన్‌రెడ్డి పాదయాత్ర

- స్థానికులతో మమేకమై సమస్యలపై ఆరా
- పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వీధుల శుభ్రత
- ఎస్ఐఆర్ పనుల పురోగతిపై క్షేత్రస్థాయి సమీక్ష

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**



కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్‌రెడ్డి ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గోల్నాక డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పాదయాత్రలో భాగంగా గోల్నాక ప్రాంతంలోని పలువురు నివాసితులతో మాట్లాడిన కిషన్‌రెడ్డి, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర స్థానిక సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి సేవలను అభినందిస్తూ, కొంతసేపు వారితో కలిసి వీధులను శుభ్రం చేశారు. నగర పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు.తర్వాత గోల్నాకలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని కిషన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి అధికారులు, బూత్ లెవల్ అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రస్తుత పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

# ఓటర్లకు అందుబాటులో ఉంటూ బిఎల్ఎలు, బిఎల్ఓలు సమన్వయంతో పని చేస్తూ (SIR) ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 13:**

ఆదివారం 125 – గాజులరామారంలోని సుభాష్ చంద్రబోస్ నగర్, చంద్రగిరి నగర్ లలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వాహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండడంలో బిఎల్ఎలు, బి.ఎల్.ఏలు సమన్వయంగా పనిచేస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు, బిఎల్ఏలు, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్ హత్యల కేసు.. రాజ్‌కుమార్ కోసం ముమ్మర గాలింపు

- 10 నుంచి 12 ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం వేట
- హైవేలు, రైల్వే స్టేషన్లు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు
- ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 12:**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును మరింత ముమ్మరం చేశారు. నిందితుడిని వీలైనంత త్వరగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, అతడి కదలికలపై నిశితంగా నిఘా కొనసాగిస్తున్నారు.దర్యాప్తులో భాగంగా నిందితుడు ఉపయోగించిన సిమ్ కార్డుల వివరాలను విశ్లేషిస్తున్న అధికారులు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. రాజ్‌కుమార్ ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే అనుమానంతో ఆ దిశగా కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటక వైపు వెళ్లే మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.జాతీయ రహదారి–44 వెంబడి ఉన్న హోటళ్లు, దాబాలు, లాడ్జీలు, వసతి గృహాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరిస్తూ నిందితుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో గాలిస్తున్నారు. సాంకేతిక ఆధారాలతో పాటు ఫీల్డ్ ఇంటెలిజెన్స్‌ను కూడా వినియోగిస్తూ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఈ కేసు వివరాల ప్రకారం, తనపై పోక్సో కేసు నమోదు చేశారనే కక్షతో రాజ్‌కుమార్ అత్యంత దారుణంగా వరుస హత్యలకు పాల్పడ్డాడు. మొదట బాలిక తల్లి, నానమ్మలను కత్తితో పొడిచి హత్య చేసిన అనంతరం, బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు కోసి చంపినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత తన ఇంటికి వెళ్లి భార్యతో పాటు నిద్రిస్తున్న ఇద్దరు చిన్నారులను కూడా కిరాతకంగా హత్య చేశాడు.కేవలం అరగంట వ్యవధిలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు చిన్నారులను హతమార్చిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.

నిందితుడిని పట్టించేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు రూ.2 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. రాజ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో శాఖాపరమైన చర్యలకు కూడా అధికారులు శ్రీకారం చుట్టారు. కేసు నిర్వహణలో నిర్లక్ష్యం ఆరోపణల నేపథ్యంలో షాబాద్ ఎస్సై రమేశ్‌ను పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మరోవైపు నిందితుడి అరెస్టు కోసం రాష్ట్రవ్యాప్తంగా గాలింపు కొనసాగుతుండగా, త్వరలోనే అతడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్.. 354 మందిపై కేసులు

**సైబరాబాద్ వెలుతురు జూలై 12:**





సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP ట్రాఫిక్ I, జి హన్మంతరావు తెలిపారు.ఈ డ్రైవ్‌లో భాగంగా 354 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.299 ద్విచక్ర వాహనదారులు,17 ఆటోలు,38 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —305 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,–31 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, –18 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (06.07.2026 – 11.07.2026) లో258 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.08 మందికి జరిమానా, జైలు శిక్ష, 01 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,249 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# పొద్దటూరులో ఘనంగా సీసీ రోడ్డు ప్రారంభోత్సవం

- బీజేపీలోకి కాంగ్రెస్ సీనియర్ నాయకుడి చేరిక!

**శంకర్ పల్లి, వెలుతురు జులై 12:**



మండల పరిధిలోని పొద్దటూరు గ్రామంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల మాజీ శాసనసభ్యులు శ్రీ కేఎస్ రత్నం హాజరై, సీసీ రోడ్డును ప్రారంభించారు.

**రత్నం సమక్షంలో బీజేపీలోకి భారీ చేరిక**

ఈ కార్యక్రమం గ్రామంలో రాజకీయ సంచలనానికి వేదికగా మారింది. పొద్దటూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులకండ్ల గోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ విధానాలను వీడి, మాజీ ఎమ్మెల్యే శ్రీ కేఎస్ రత్నం ఆధ్వర్యంలో అధికారికంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఈ సందర్భంగా రత్నం ఆయనకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

కొండా విశ్వేశ్వర్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై తాను బీజేపీలో చేరినట్లు ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

**ఘనంగా కృతజ్ఞతలు**

ఈ సీసీ రోడ్డు ప్రారంభోత్సవం మరియు చేరికల కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అలాగే గ్రామ ప్రజలు మరియు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు.

కార్యక్రమాన్ని ఇంతటి ఘన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ, పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పొద్దటూరు గ్రామ బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు ఒక ప్రకటనలో తెలిపారు.

# స్వచ్ఛత పఖ్వాడా–2026 పరిశుభ్రమైన భవిష్యత్తు కోసం హెచ్‌పీసీఎల్ ముందడుగు

- సికింద్రాబాద్ టెర్మినల్ ఆధ్వర్యంలో అన్నోజిగూడ లో అవగాహన కార్యక్రమం

**మేడ్చల్ వెలుతురు జూలై 12:**



స్వచ్ఛత పఖ్వాడా–2026 కార్యక్రమాల భాగంగా, హెచ్‌పీసీఎల్ సికింద్రాబాద్ టెర్మినల్ ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించడంతో పాటు పోస్టర్ మరియు నినాదాల (స్లోగన్) పోటీలు నిర్వహించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాల సరైన నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.పర్యావరణహిత జీవనశైలిని ప్రోత్సహించేందుకు విద్యార్థులకు జూట్ బ్యాగులు, స్టేషనరీ కిట్లు మరియు బహుమతులు పంపిణీ చేశారు. అదనంగా పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రతను మెరుగుపరచేందుకు డస్ట్‌బిన్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సికింద్రాబాద్ టెర్మినల్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని స్వచ్ఛమైన పాఠశాల, స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

# SIR సర్వేలో చురుగ్గా పాల్గొంటున్న బీఆర్ఎస్ నాయకులు



**నార్కట్ పల్లి వెలుతురు జూలై 12:**

నార్కట్‌పల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న SIR (Special Intensive Revision) సర్వేలో బీఆర్ఎస్ నాయకులు చురుకుగా భాగస్వాములవుతున్నారు.

ఆదివారం బీఎల్ఓలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ ఎన్యూమరేషన్ (గణన) ఫారాలను పూర్తి చేయించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పుల్లెంల వెంకట్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు SIR సర్వేలో తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు. సర్వే గణన పత్రాలను పూర్తి చేయడంలో ఓటర్లకు అవసరమైన సహకారం అందిస్తూ, సర్వే ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

# రూ. 76 కోట్లతో నార్కెట్‌పల్లి–బ్రహ్మణవెల్లంల రైల్వే ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 12:**

నార్కెట్‌పల్లి మండలం నుండి బ్రహ్మణవెల్లంల గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో రూ.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన రహదారి మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంతో నార్కెట్‌పల్లి, బ్రహ్మణవెల్లంలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని, అత్యవసర సేవల రాకపోకలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన జరగడం నియోజకవర్గానికి చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. రూ.76 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం రైల్వే గేటు వద్ద ఏర్పడే ట్రాఫిక్



సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ప్రయాణికులు ఎంతో ప్రయోజనం పొందుతారని చెప్పారు.నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని, నకిరేకల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అభివృద్ధి కార్యక్రమాన్ని స్వాగతిస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్, ఉప సర్పంచ్ సామ శిరీష ప్రవీణ్,చెరువుగట్టు సర్పంచ్ నేతగాని కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాయం శ్యాంసుందర్,బత్తుల ఉషయ్య, పాశం శ్రీనివాస్ రెడ్డి,వడ్డే భూపాల్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి ch.రవికుమార్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ మండల అధ్యక్షుడిగా పల్లెర్ల శ్రీకాంత్



**మునుగోడు, జూలై 12(వెలుతురు):**

వాసవి క్లబ్ వి–102ఏ మునుగోడు నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏంఎస్ఆర్ బంక్వెట్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెర్ల శ్రీకాంత్,ఉపాధ్యక్షుడిగా గజ్జల నాగేష్,ప్రధాన కార్యదర్శిగా పామునిగుండ్ల నవీన్‌కుమార్, కోశాధికారిగా నీలా వెంకన్న ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా యడవల్లి సురేష్‌కుమార్,గార్లపాటి శ్రీను బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.సమావేశానికి క్లబ్ గవర్నర్ డాక్టర్ అల్లాడి పరమేశ్వర్,ముఖ్య అతిథి మార్యాల చంద్రమౌళి గుప్తా, క్యాబినెట్ కార్యదర్శులు ఉప్పల శ్రీనివాస్, విజయలక్ష్మి,రాష్ట్ర కోశాధికారి నర్సింహా, రీజినల్ చైర్‌పర్సన్ బాలమణి హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, సామాజిక



సేవకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గజ్జల కిషన్,తడకమళ్ల భిక్షం, చిన్నస్వామి,ఈశ్వర్, మేడం శ్రీను,యాదయ్య, యాదగిరి,వీరశంకర్, నర్సింహా,సుభాష్, శ్రవణ్, కిరణ్,స్వాతి, విజయలక్ష్మి, సత్యవతి, విశాల, ఉమా, వాసవి, మాధవి, సరస్వతి, నీరజ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# రూ. 339.59 కోట్లతో భువనగిరి–చిట్యాల నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రామన్నపేట వెలుతురు జూలై 12:**

రామన్నపేటలో ఆదివారం స్టేజ్–1, ప్యాకేజ్–2/7లో భాగంగా రూ.339.59 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 109.3 కిలోమీటర్ల పొడవైన రహదారుల అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా భువనగిరి నుండి చిట్యాల వరకు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించే నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, భువనగిరి–చిట్యాల నాలుగు లేన్ల రహదారి కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, రహదారి పూర్తయితే జిల్లాలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.దశాబ్దాలుగా ఈ రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా ప్రభుత్వం ఆ కోరికను నెరవేరుస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడి, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం,





పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుంది. అలాగే వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల కోసం రక్తదానానికి సిద్ధం: బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై

**హైదరాబాద్, వెలుతురు జూలై 12:**



రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై కార్యకర్తలు రక్తదానానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా "రేవంత్ రెడ్డి రక్త దాహానికి రక్తదానం" పేరుతో జూలై 13 ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కన్నెపల్లి పంపులను వెంటనే ప్రారంభించి గోదావరి జలాలను రిజర్వాయర్లకు తరలించాలని, తద్వారా రైతులకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీరు, గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన పర్యటనను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.రైతుల కోసం నీరు కోరితే బీఆర్ఎస్ నాయకుల రక్తం గురించి వ్యాఖ్యానించడం బాధ్యతారాహిత్యమని పేర్కొంటూ, రైతుల ప్రయోజనాల కోసం తమ రక్తాన్ని ఇవ్వడానికైనా సిద్ధమేనననే సందేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎంపీపీఎస్ కోతులారం పాఠశాల ప్రధానోపాధ్యాయుని అవినీతి సామ్రాజ్యం, తక్షణమే క్రిమినల్ చర్యలు చేపట్టాలి

- **బోల్లుగిరి ముకేష్ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ**

**మునుగోడు వెలుతురు జూలై 12:**

నల్గొండ మునుగోడు మండలం, ఎంపీపీఎస్ కోతులారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (HM) పోకబత్తి వివేక నందన్ విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తూ, అక్రమాల పుట్టగా మారారు. ఇతని ఆగడాలపై సమగ్ర విచారణ జరిపి, కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ గారికి మరియు జిల్లా విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారులకి పిర్యాదు చేయడం జరిగింది హెడ్‌మాస్టర్‌పై సమగ్ర విచారణ నివేదికలో తీవ్రమైన ఆరోపణలు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు కఠిన చర్యలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. నివేదికలో ఫోర్జరీ, ఆర్థిక అవకతవకలు, ఆడిట్ అభ్యంతరాలు, ప్రభుత్వ నిధుల వినియోగంలో అక్రమాలపై ప్రస్తావిస్తూ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బోల్లుగిరి ముకేష్ కోరారు సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా వెలుగుచూసిన అంశాలు విద్యాశాఖలో ఇతను చేస్తున్న అరాచకాలకు అద్దం పడుతున్నాయి.

**ప్రధాన ఆరోపణలు:**

విద్యా వ్యవస్థ నిర్వీర్యం: ప్రధానోపాధ్యాయుని బాధ్యతారాహిత్య ప్రవర్తన, అరాచక వైఖరిని భరించలేక విద్యార్థులు పాఠశాలకు రావాలంటేనే భయపడే స్థాయికి పరిస్థితి దిగజారింది. దీనివల్ల విద్యార్థుల సంఖ్య దారుణంగా తగ్గి కేవలం 8కి పడిపోయింది. ఇది ప్రభుత్వ పాఠశాలల పట్ల ఇతని నిర్లక్ష్యానికి నిదర్శనం.

అధికార యంత్రాంగం అండతో దౌర్జన్యం: స్థానిక స్థాయి అధికారుల అండదండలు ఉండటంతో ఇతని అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. చట్టాన్ని, ఉన్నతాధికారులను లెక్కచేయని ధీమాతో ఇతను వ్యవహరిస్తున్నారు.నేరపూరిత ఫోర్జరీ & నిధుల లూటీ: పాఠశాల నిధులను కాజేసేందుకు తోటి ఉపాధ్యాయురాలి సంతకాన్ని ఫోర్జరీ చేయడం దారుణం. ఇది కేవలం అవినీతి మాత్రమే కాదు, IPC సెక్షన్ 468 మరియు 471 కింద తీవ్రమైన క్రిమినల్ నేరం.బోగస్ బిల్లుల దందా: GST, బిల్ నంబర్లు లేని నకిలీ రసీదులతో ఆడిట్ అధికారులను తప్పుదోవ పట్టించి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు.

**ఆస్తుల అపహరణ:**

దాతలు పాఠశాల అభివృద్ధికి ఇచ్చిన వస్తువులను (ఫ్యాన్లు, కుర్చీలు) సొంత ఇంటికి తరలించి, పాఠశాలను తన సొంత ఆస్తిగా మార్చుకున్నారు.FRS హాజరులో మోసం: బయోమెట్రిక్ హాజరు రిపోర్టులను ట్యాంపరింగ్ చేస్తూ, పాఠశాల వేళల్లో విధులకు గైర్హాజరు కావడం ద్వారా విద్యా హక్కు చట్టాన్ని అవహేళన చేస్తున్నారు.


మా డిమాండ్:

ఒక బాధ్యతాయుతమైన ప్రధానోపాధ్యాయుడిగా ఉండాల్సిన వ్యక్తి, ఒక నేరస్థుడిలా వ్యవహరిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు. కావున, జిల్లా కలెక్టర్ గారు ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక ప్రత్యేక విచారణాధికారిని (Special Inquiry Officer) నియమించి, ఇతనిపై వెంటనే FIR నమోదు చేసి, సస్పెన్షన్ వేటు వేసి, విధుల్లో నుండి శాశ్వతంగా తొలగించాలి. లేనిపక్షంలో, కార్పొరేట్ విద్య నియంత్రణ JAC ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు దిగుతామని హెచ్చరిస్తున్నాము.అక్రమాలకు సంబంధించిన పక్కా ఆధారాలు (వీడియో/ఆడియో సాక్ష్యాలు, ఫోర్జరీ పత్రాలు) అధికారులకు అందజేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము.

# ప్రజలందరూ SIR లో పాల్గొని తమ ఓటు హక్కుని కాపాడుకోవాలి..!

● **పల్లె.వంశీ కృష్ణ గౌడ్, న్యాయవాది, SIR బీజేపీ దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త (BLA 01)**

**దుబ్బాక వెలుతురు జూలై 12:**



దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డులో SIR ఎన్యూమరేషన్ కార్యక్రమంలో SIR బీజేపీ దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త (BLA 01) పల్లె వంశీకృష్ణ గౌడ్ పాల్గొని ఎన్యుమరేషన్ ఫారం ను BLO మారోజు.నాగరాణి గారికి అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం మనకు ఇచ్చిన గొప్ప ఆయుధం ఓటు హక్కు అని, వార్డు స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలన్నా, ప్రభుత్వాలను మార్చాలన్న ఓటుహక్కే సామాన్యుడికి ఆయుధంగా ఉంటుంది, అలాంటి ఆయుధాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరుడికి ఉంది, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలంటే SIR కార్యక్రమంలో పాల్గొని తమ ఇంటికి వచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలను నింపి విధిగా బిఎల్ఓ లకు అందజేయాలని కోరారు, గతంలో ఎన్నిసార్లు ఓటు వేసిన వాళ్ళైనా సరే, ఈ ఫారం నింపి ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉన్నందున ప్రజలందరూ ఈ అంశాన్ని సీరియస్గా తీసుకొని BLO లకు మరియు BLA 02 లకు సహకరించి వివరాలతో నింపిన ఫారాలకు లేటెస్ట్ ఫోటోను జతచేసి ఇవ్వగలరు, ఈనెల 15లోగా తప్పకుండా ప్రతి ఒక్క ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది, ఫారాలు నింపడంలో ఏదైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో, మరియు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న హెల్ప్ డెస్క్ లకు వెళ్లి పరిష్కరించుకోగలరు,ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం ఒక వ్యక్తికి ఒకే ఓటు హక్కు ఉండాలి , ఇప్పటివరకు చాలామందికి రెండు చోట్ల లేదా, మూడు చోట్ల ఓటు హక్కు అనేది ఉంది, కానీ ప్రస్తుతం అలా చేయకూడదు, మనకు రెండు చోట్ల ,లేదా ఇంకా ఎక్కువ చోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తే,మనకు కావాల్సిన ఒకే చోట మాత్రమే ఫారం నింపి ఇవ్వాల్సి ఉంటుంది, అలా కాకుండా రెండు మూడు చోట్ల ఓటు హక్కు కావాలి అనే అత్యాశతో ఎవరైనా ఆలోచిస్తే చట్టం కఠినంగా శిక్షిస్తుంది, జైలు శిక్ష పడే అవకాశం ఉంది, కావున ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించగలరు....! SIR అనగా సమగ్ర ప్రత్యేక సవరణ అనే కార్యక్రమం, కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించే కార్యక్రమం, దీనికి రాజకీయ పార్టీలకి, ప్రభుత్వాలకి సంబంధం లేదు, చాలా ఏళ్లుగా చనిపోయిన వారి ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లు,పరాయి దేశం వారి ఓట్లు, డబల్ ఓట్లు ఉన్నాయి కాబట్టి ఓటర్ లిస్టును సమగ్రంగా ప్రక్షాళన చేయాలని మాత్రమే ఈ కార్యక్రమం చేపట్టారు, ఎవరి ఓట్లను లక్ష్యంగా చేసుకొని తొలగించాలని ఉద్దేశం ఎన్నికల సంఘానికి గాని, ఏ రాజకీయ పార్టీకి కానీ లేదు, ఈ దేశ పౌరులు కాకుండా పరాయి దేశం నుంచి ఇక్కడకు వచ్చి, ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు సంపాదించుకొని మనల్ని ఇబ్బంది పెట్టే వ్యక్తుల ఓట్లు ఈ కార్యక్రమంలో తొలగించబడతాయి, అలాగే డబల్ ఓట్లు తొలగించబడతాయి, కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండగలరు, అపోహలను, అవాస్తవ ప్రచారాలను నమ్మకండి, తప్పకుండా SIR కార్యక్రమంలో పాల్గొని ఈ దేశ పౌరులుగా బాధ్యతగా ఉండండి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షులు ధోరగొల్ల శ్రీకాంత్ యాదవ్,BLO మారోజు.నాగరాణి ,మున్సిపల్ అధికారులు మట్టి దిలీప్ కుమార్, ఆకుల విజయలక్ష్మి మరియు ఇతరులు పాల్గొన్నారు....!

## హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ వెలుతురు జూలై 12:**

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని 1వ డివిజన్ హనుమాన్ నగర్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద 12.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు తదితర అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని తెలిపారు.ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి కొనసాగుతుందని మేయర్ అన్నారు.అనంతరం స్థానిక ప్రజలు తమ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి భారీ అపర్ణ జితేందర్,26 వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ,ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అలుగునూరులో 133,134 పోలింగ్ బూత్ లలో ముమ్మరంగా ఓటర్ల నమోదు

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, శక్తి కేంద్ర ఇన్చార్జి బొంతల కళ్యాణ్ చంద్ర**

**కరీంనగర్ వెలుతురు జూలై 12:**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు పరిధిలోని పోలింగ్ బూత్ 133, 134లలో ఓటర్ల నమోదు( ఎస్ ఐ ఆర్) ప్రక్రియ శరవేగంగా, పకడ్బందీగా కొనసాగుతుంది. ఆదివారం రోజున ఈ నమోదు ప్రక్రియను బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సదరు పోలింగ్ బూత్‌ల (శక్తి కేంద్రం) ఇన్‌ఛార్జి బొంతల కళ్యాణ్ చంద్ర స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ పోలింగ్ బూత్ 133 లో71 శాతం, 134 లో 79 శాతం నమోదు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. బిఎల్‌ఓ అధికారులు గౌరీ , లత లు మ్యాపింగ్ , ఓటర్ నమోదు వివరాలను విజయవంతంగా పూర్తి చేయడానికి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో బిఎల్‌ఓలు చూపుతున్న చొరవను, ఎన్నికల అధికారుల సమన్వయాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే, ఈ ప్రక్రియకు సహకరిస్తున్న స్థానిక ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా బాధ్యతాయుతంగా ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. బూత్ లెవల్ అధికారులతో పాటు పౌర సమాజం కూడా ఇందులో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.ఇప్పటివరకు ఓటు హక్కు నమోదు చేసుకోని వారు ఎవరైనా ఉంటే, వెంటనే సంబంధిత బిఎల్‌ఓలను సంప్రదించి, దరఖాస్తు ఫారాలను అందజేయాలని ఆయన సూచించారు.

## కృష్ణ చతుర్థి ప్రత్యేక పూజలు

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 12 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలో గల భక్త మార్కండేయ ఆలయంలో 13-07-2026 సోమవారం రోజున కృష్ణ చతుర్థి పురస్కరించుకొని శ్రీ భక్త మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకములు పుష్పార్చన,భజన కీర్తనలు,భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించబడును. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన రామ్ రాజ్ కాటన్ ఫ్రాంచైజీ ఓనర్ పేర్ల కేశవులు అంజమ్మ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఇట్టి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్త మార్కండేయ మహర్షి కృపా కృపాకటాక్షాలు పొందగలరు.

## గానకోకిల ఎస్. జానకి గారికి రావి ఆకుపై వినూత్న నివాళి








**వెలుతురు నారాయణఖేడ్ జూలై 12 :**

సంగారెడ్డి జిల్లా :- భారతీయ సినీ సంగీత రంగంలో తన మధుర గానంతో కోట్లాది సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గానకోకిల ఎస్. జానకి గారికి నారాయణఖేడ్‌కు చెందిన శివ కుమార్ (Shiva Leaf Artist) వినూత్నంగా రావి ఆకుపై చేతితో చెక్కిన లీఫ్ ఆర్ట్‌ను రూపొందించి నివాళులర్పించారు.సాధారణ రావి ఆకును ప్రత్యేక పద్ధతిలో సిద్ధం చేసి, అత్యంత సూక్ష్మంగా చేతితో చెక్కుతూ ఎస్. జానకి గారి చిత్రాన్ని కళాత్మకంగా మలిచారు. ఈ లీఫ్ ఆర్ట్ ఆమెపై ఉన్న గౌరవం, అభిమానం, సంగీతానికి ఆమె చేసిన విశిష్ట సేవలకు గుర్తుగా రూపొందించినట్లు శివ కుమార్ తెలిపారు. ఎస్. జానకి పాడిన వేలాది పాటలు భారతీయ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆమె గాత్రం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. గొప్ప కళాకారులు భౌతికంగా మన మధ్య లేకపోయినా, వారి కళ ఎప్పటికీ సజీవంగా ఉంటుందని ఆయన అన్నారు.శివ కుమార్ గత కొన్నేళ్లుగా ప్రముఖులు, సామాజిక సేవకులు, కళాకారులు, వివిధ ప్రత్యేక సందర్భాల కోసం రావి ఆకుపై చేతితో లీఫ్ ఆర్ట్ రూపొందిస్తూ తన ప్రత్యేక కళతో గుర్తింపు పొందుతున్నారు.

## బీజేపీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాడాలి: డీకే అరుణ

**గద్వాల, వెలుతురు జూలై 12:**



జోగులాంబ గద్వాల జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన డీకే బంగ్లాలో నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు యువకులు ఆమె సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో డీకే అరుణ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను కార్యకర్తలు సీరియస్‌గా తీసుకుని బోగస్ ఓట్ల తొలగింపులో చురుకుగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయిందని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శిస్తూ, ప్రభుత్వ అవినీతి, దోపిడీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల కీలక పాత్ర వహించినార్రు

**పిడమర్తి రవి ఓయూ జేఏసీ చైర్మన్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**



ఓయూ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యం లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజ్ దగ్గర వివిధ యూనివర్సిటీల తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమావేశం ఏర్పాటు చేసినారు, అన్ని యూనివర్సిటీల వివిధ సంఘాల విద్యార్థి నాయకులు హాజరైనారు. .ఈ కార్యక్రమంలో వట్టి రామారావు గౌడ్, శ్రీధర్, సాంబశివ గౌడ్, వెంకటేశ్, పొన్నం.ముత్యం గౌడ్,నాగరాజు, ఇఫ్లూ తెలంగాణ పూర్వ విద్యార్థి నాయకులు గుర్రం సీతారాములు,డాక్టర్ పవన్ చక్రవర్తి ,నిషాని.రమేష్ ,చుక్క గిరి,.బోల.రమేష్, తదితరుల పాల్గొన్నారు.

# రాజకీయ జగడాలు కాదు.. రైతులకు సాగు జలాలు ఇవ్వాలి: కూనంనేని సాంబశివరావు

**వనపర్తి, వెలుతురు జూలై 12:**




రాష్ట్రంలో రాజకీయ విమర్శలు పక్కనపెట్టి రైతులకు సాగునీరు అందించడంపై దృష్టి సారించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వనపర్తిలో జరిగిన సీపీఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల పరస్పర ఆరోపణలను ఖండించిన ఆయన, సెంట్రల్ వాటర్ కమిషన్ తుది నివేదిక ఆధారంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కన్నెపల్లి రిజర్వాయర్ నింపి రైతులకు నీళ్లు అందించాలన్నారు.పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరానికి జాతీయ హోదా ఇచ్చినట్లే తెలంగాణ ప్రాజెక్టులకు కూడా ఇవ్వాలని కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించిన ఆయన, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 9 నుంచి 16 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, సెప్టెంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

# పవన్ కళ్యాణ్ కు పలువురి పరామర్శ

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**




**ముంబై లో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను పలువురు పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు. మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్య ప్రసాద్, నారాయణ తదితరులు ఉన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసు కున్నారు.**

# ఫెసపల్లో వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన నగర క్రీడాకారులు



ఆస్ట్రేలియాలో త్వరలో జరగనున్న ఫెసపల్లో వరల్డ్ కప్ పోటీలకు నగరానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఫెసపల్లో అసోసియేషన్ అధ్యక్షుడు రేణుక దాస్ జెన్వాడ్కర్ ఎంపికైన క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. తెలంగాణలో శిక్షణ పొందిన విశాల్, ఉద్దేశ్, జూగూటి ఆర్ఎన్ అక్షయ్, వైష్ణవ్, అరుణ్ సాయి మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియాలో అక్టోబర్ 2 నుంచి 5 వరకు జరిగే ఈ పోటీలలో పది దేశాలు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ క్రీడను ప్రోత్సహించేందుకు చాలా మంది వ్యాపార వేత్తలు ముందుకు వస్తున్నారు. అంతే కాకుండా తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ శాఖ అధికారులు సహకరించి, ఆర్థికంగా తోడ్పాటు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అసోసియేషన్ సెక్రటరీ జైదీప్ లఖానే, అసోసియేషన్ ప్రతినిధులు మయూర ఆకుల, విశాల్, మనీషా భారతీయ లు పాల్గొన్నారు.

# మెరిట్ సాధించిన నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించిన రెడ్డి జన సంఘం

**బషీర్ బాగ్ వెలుతురు 12 జులై:**



ఉన్నత విద్యకై మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎన్నో ఏళ్ళుగా రెడ్డి జన సంఘం ఉపకార వేత నాలను అందించి ప్రోత్సహిస్తుందని సంఘం (అబిడ్స్) అధ్యక్షులు వేమిరెడ్డి నరసింహారెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు ఆది వారం అబిడ్స్లోని రెడ్డి బాలుర వసతి గృహం ఆడిటోరియంలో 2026–27 విద్యా సంవత్సరానికి చెందిన మెడికల్, ఇ జనీరింగ్, గ్రాడ్యుయేషన్ ఇతర కోర్సులలో మెరిట్ సాధించిన 254 మంది విద్యార్థిని, విద్యార్థులకు 20 లక్షల 85 వేల రూపాయల చెక్కుల రూపేణా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆ యన సంఘం కార్యదర్శి పాండురంగారెడ్డి కాశిరెడ్డి, ఉపాధ్యక్షురాలు అలుక సుకన్యారెడ్డి, కార్యదర్శి డాక్టర్ బి మధుసూ దన్ రెడ్డి, సభ్యులు తీగల మోహన్ రెడ్డి, ఎం భారతి, జైపాల్ రెడ్డిలతో కలిసి రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి చిత్ర పటా నికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత విద్య కోసం గత ఎన్నో ఏళ్ళుగా ప్రతి యేటా దాతల సహకారంతో ఉపకార వేతనాలను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ యేడాది 11 మం మెడికల్ విద్యార్థులకు 1 లక్ష 32 వేలు, 121 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు 10 లక్షల 85 వేలు, ఇతర కోర్సులు, డ్యుయేషన్కు చెందిన 122 మంది విద్యార్థులకు 8 లక్షల 54 వేల రూపాయలను మొత్తంగా 20 లక్షల 85 వేల రూపా యల ఉపకార వేతనాలను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులు ఉన్నత విద ను పూర్తి చేసుకొని స్థిరంగా ఎదిగిన అనంతరం తమ వంతు సహాయంగా ప్రతి యేటా నిర్వహి ంచే ఉపకార వేతనాల పం పిణీలో సహకారం అందించి రాబోయే విద్యార్థుల ఉన్నత విద్యకై తమం సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్క విద్యార్థి తాము పొందిన సహాయం మరొరకు పొందాలనే భావనతో ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన విద్యార్థులకు సూచించా రు. కార్యదర్శి పాండురంగారెడ్డి కాశిరెడ్డి మా ట్లాడుతూ ప్రతి యేడా సంఘం అబిడ్స్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి పైగా విద్యార్థులకు ఉన్నత వి ద్యకై ప్రోత్సాహాన్ని అందో కు గాను ఉపకార వేతనాలను అందజేస్తున్నామని ఆయన వివరించారు.ఈ ఉపకార వేతనాలను అందిం చేందుక సహకారం మరువలేనిదని ఆయన అన్నారు. ఈ సంధర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, దాతలు పెద్దెత్తున పాల్గొన్నారు.

# తెలంగాణ ఎలక్ట్రిషన్స్ జే ఏ సీ సమావేశంలో నికోలా టెస్లా జయంతి వేడుకలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**






తెలంగాణ ఎలక్ట్రికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం రామంతపూర్ లోని కమిటీ హాల్లో ప్రముఖ విద్యుత్తు నిపుణుడు నికోలా టెస్లా జయంతిని పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నటువంటి ప్రవేట్ ఎలక్ట్రిషన్ల నికోలా టెస్లా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి పాల్గొని సభను ఉద్దేశించి ఈ విధంగా మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాదులో ఉన్నటువంటి ప్రతి ఎలక్ట్రిషన్ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు ద్వారా వైర్మన్ పర్మిట్ లో పాటు సూపర్వైజర్మెంట్ ఫార్మేట్ కూడా తీసుకోవాలని ఈ సభను ఉద్దేశించి అన్నారు. అదేవిధంగా కొన్ని జిల్లాలకే పరిమితమైన డబుల్ ఆర్ వన్ డబ్ల్యూ ఆర్ 2 ను తెలంగాణ వ్యాప్తంగా ఇంప్లిమెంట్ చేయాలని. ఇంప్లిమెంట్ చేసిన ఎడలనే. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎలక్ట్రిషన్ ఉద్దేశించి నక్క యాదగిరి అన్నారు. సభ నిర్వాహకులు కొండ బాల్రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆర్గనైజేషన్ కమిటీలో ఉన్న ప్రతి సభ్యుడు జేఏసీలో ఉండాలని. వారు సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకురావాలని. రేట్లో విషయంలో గాని. సమస్య విషయంలో గాని. మా దృష్టికి తీసుకొచ్చినప్పుడు కచ్చితంగా సాలు చేస్తామని అన్నారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా ఆర్గనైజేషన్ లో పని చేస్తున్నటువంటి ఎలక్ట్రిషన్లను ఒక తాటిపై తీసుకురావాలి ఆలోచనతో జేఏసీ పనిచేస్తుందని జేఏసీ కమిటీ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ లో ఉన్న అసోసియేషన్లన్నీ పాల్గొన్నారు అని. నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియు ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డ్ మెంబర్ నేమాల బెనర్జీ. రాష్ట్ర ఉపాధ్యక్షులు వై వెంకటేశ్వర్లు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రావణ్ కుమార్. శేర్లింగంపల్లి అధ్యక్షులు ఉదయ్ భాస్కర్. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల శ్రీకాంత్ రెడ్డి. జిల్లాకు సంబంధించిన కార్యవర్గ సభ్యులు. మేడ్చల్ జిల్లాకు సంబంధించి బడే యాదగిరి. వి సత్యనారాయణ మరియు కాశీ నాయుడు. మాకమం శ్రీనివాస్ నేత. నాగేశ్వరరావు గురుస్వామి. వెంకటేష్. సతీష్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ లో ఉన్నటువంటి ఆర్డినేషన్ లో పనిచేస్తున్న అసోసియేషన్ సంబంధించిన వ్యక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో ఘనంగా శ్రీమద్భగవద్గీత సంపూర్ణ పారాయణం

**100 మంది గీతాభక్తుల పాల్గొనిక – "గీత చదివి... నీ రాత మార్చుకో" : గట్టు అరుంధతి రంగాచార్యులు**

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**



హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నక్క వెంకటమ్మ యాదవ్–నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గీతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీమద్భగవద్గీత సంపూర్ణ పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది గీతాభక్తులు పాల్గొని పారాయణాన్ని విజయవంతం చేశారు.విజయలక్ష్మి దేవాలయం ప్రధాన అర్చకులు గట్టు అరుంధతి రంగాచార్యులు, గీతా శిరోమణి విశ్వేశ్వర్, ఉపేంద్ర స్వామి ఆధ్వర్యంలో భగవద్గీత సంపూర్ణ పారాయణం నిర్వహించారు.ఈ సందర్భంగా గట్టు అరుంధతి రంగాచార్యులు మాట్లాడుతూ, మహాభారతంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి అందించిన అమూల్యమైన జీవన మార్గదర్శకమే భగవద్గీత అని పేర్కొన్నారు. గీత వృద్ధులు మాత్రమే చదవాల్సిన గ్రంథం కాదని, చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ నిత్యం చదవాల్సిన పవిత్ర గ్రంథమని తెలిపారు. ప్రతిరోజూ కనీసం ఒక శ్లోకమైనా చదివి, దాని భావాన్ని జీవితంలో ఆచరిస్తే వ్యక్తిత్వ వికాసంతో పాటు జీవిత సత్యాలు అవగాహన అవుతాయని వివరించారు.ముఖ్యంగా విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు భగవద్గీతను కూడా నిత్యం చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. "గీత చదివి... నీ రాత మార్చుకో" అనే సందేశంతో యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. గీతలోనే నిజమైన వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన విలువలు ఉన్నాయని, దాని బోధనలను ఆచరిస్తే శ్రీకృష్ణ పరమాత్మ కరుణా కటాక్షాలు లభిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్, రామకృష్ణ, చంద్రమౌళి, జె.వి. కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పి. బడేసాబ్, నక్క శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

# కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని కోమరవేల్లి మల్లన్నకు అభిషేకం,కొండపోచమ్మ కు బోనాలు

**బషీర్ బాగ్ వెలుతురు 12 జులై:**

ప్రజా వ్యతిరేక పరిపాలనను పారదోలి కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ఆశిస్తూ..గోశామహల్ బిఅరెస్ నేతలు కోమరవేల్లి మల్లన్నకు అభిషేకం,కొండ పోచమ్మ తల్లికి బోనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.జాంబాగ్ బిఅరెస్ సీనియర్ నేత అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గోశామహల్ నుండి బిఅరెస్ సభ్యత్వం,SIR ఇంచార్జి నాగేందర్ గౌడ్,గోశామహల్ బిఅరెస్ ఇంచార్జి ఆర్వీ మహేందర్ కుమార్,బిఅరెస్ కాంటెస్టెడ్ ఎంపీ గడ్డం శ్రీనివాస్ యాదవ్ లతో కలసి నేతలు పెద్ద ఎత్తున్న 50కార్లతో బయల్దేరి కొమురవేల్లిలోని మల్లన్న స్వామికి అభిషేకం నిర్వహించి,కొండ పోచమ్మ కు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా గోశామహల్ బిఅరెస్ సభ్యత్వ,SIR ఇంచార్జి నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ... ప్రజలు కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను విమర్శిస్తూ రేవంత్ రెడ్డి పాలన వద్దు కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గోశామహల్ నుండి కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని అన్నారు.కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి 420హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రైతుల ను, నిరుద్యోగుల ను, ఉ ద్యోగుల ను, విద్యార్థుల ను అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజల అభిస్టం రోజురోజుకు పెరుగుతుందని అన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని గోశామహల్ బిఅరెస్ నేతలు సంఘటితంగా దైవ పూజలు నిర్వహించి ముందుకెళ్ళడం అభినందనీయం అని నాగేందర్ అన్నారు.



# రిమూవల్ కాదు.. సస్పెన్షన్ చాలు

- జైల్లో 30 రోజులు ఉంటే మంత్రి పదవులకు సస్పెన్షన్?.. జేపీసీ కీలక సిఫార్సులు
- తీవ్ర నేరాల్లో అరెస్టై 30 రోజులకు పైగా జైలులో ఉంటే పదవులపై ప్రభావం
- 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై కీలక మార్పులను సూచించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ
- పదవుల రద్దుకు బదులుగా సస్పెన్షన్ విధించాలని జేపీసీ అభిప్రాయం
- నిర్దోషిగా తేలితే సస్పెన్షన్ ఆటోమేటిక్‌గా ఎత్తివేయాలని సిఫార్సు
- ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే నేరాలకే నిబంధన వర్తించాలని సూచన
- ఉన్నత పదవుల్లో ఉన్న నేతల కేసుల కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు ప్రతిపాదన
- కేజ్రీవాల్, సెంథిల్ బాలాజీ కేసుల నేపథ్యంలో కేంద్రం బిల్లుకు రూపకల్పన
- గత ఏడాది ఆగస్టులో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు
- జేపీసీ నివేదికను ఈ నెల 17న లోక్‌సభ స్పీకర్‌కు సమర్పించనున్న కమిటీ
- జేపీసీ సిఫార్సులపై ఒవైసీ, సుప్రియా సూలే భిన్నాభిప్రాయ నోట్‌కు సిద్ధం

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 012:**

తీవ్ర క్రిమినల్ కేసుల్లో అరెస్టై వరుసగా 30 రోజులకు మించి జైలులో ఉండే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రుల పదవులపై ప్రభావం చూపే 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కీలక సవరణలను సూచించినట్లు సమాచారం. బిల్లులో ఉన్న పదవుల "రద్దు" (రిమూవల్) అనే నిబంధనకు బదులుగా "సస్పెన్షన్" అనే పదాన్ని ఉపయోగించాలని కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ వివిధ కేసుల్లో అరెస్టై దీర్ఘకాలం జైలులో ఉన్నప్పటికీ తమ పదవుల్లో కొనసాగిన నేపథ్యంలో రాజ్యాంగంలోని 75, 164, 239ఎఎ అధికరణాలకు సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో 130వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది.ఒడిశాకు చెందిన బీజేపీ లోక్‌సభ సభ్యురాలు, మాజీ ఐఏఎస్ అధికారి అపరాజిత సారంగి నేతృత్వంలోని జేపీసీ బిల్లును సమగ్రంగా పరిశీలించి పలు సిఫార్సులతో తుది నివేదికను సిద్ధం చేసింది. ఈ నెల 17న లోక్‌సభ స్పీకర్‌కు నివేదికను సమర్పించనున్నట్లు సమాచారం.బిల్లు లక్ష్యాలు, ఉద్దేశాల్లో ఉన్న "తీవ్ర క్రిమినల్ నేరాలు" అనే పదబంధాన్ని మరింత స్పష్టంగా నిర్వచించాలని జేపీసీ సూచించింది. "ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడే అవకాశం ఉన్న తీవ్రమైన నేరాలు" అనే విధంగా దానిని సవరించాలని ప్రతిపాదించింది. అలాగే అలాంటి నేరాలను ప్రత్యేక షెడ్యూల్‌లో పొందుపరచాలని కూడా సూచించింది.జైలుకు వెళ్లిన ప్రజాప్రతినిధి అనంతరం నిర్దోషిగా విడుదలైనా, లేదా నిర్దిష్ట గడువులోగా ప్రాసిక్యూషన్ కేసును ముందుకు తీసుకెళ్లడంలో విఫలమైనా, విధించిన సస్పెన్షన్ ఆటోమేటిక్‌గా ఎత్తివేయాలని కమిటీ సిఫార్సు చేసింది. దీనివల్ల తుది తీర్పు రాకముందే విధించిన చర్య శాశ్వత శిక్షగా మారకుండా ఉంటుందని అభిప్రాయపడింది.ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులపై నమోదయ్యే కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ లేదా స్పెషల్ కోర్టులను ఏర్పాటు చేయాలని జేపీసీ సూచించింది. దీంతో ఇటువంటి కేసుల్లో సుదీర్ఘకాలం విచారణ కొనసాగకుండా త్వరిత నిర్ణయాలు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొంది.కాగా, జేపీసీ ప్రతిపాదించిన ఈ సిఫార్సులతో విభేదిస్తూ కమిటీ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, సుప్రియా సూలే ప్రత్యేక భిన్నాభిప్రాయ నోట్‌ను సమర్పించనున్నట్లు సమాచారం.

## ఎన్నికల సంఘానికి తెలంగాణ రక్షణ సేన లేఖ

- పార్టీ రిజిస్ట్రేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి
- వెయ్యి అభ్యంతరాల కాపీలు ఇవ్వాలని ఈసీని కోరిన అనిల్‌కుమార్
- సమాధానానికి అవకాశం ఇచ్చాకే విచారణ నిర్వహించాలని అభ్యర్థన

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

తెలంగాణ రక్షణ సేనకు రాజకీయ పార్టీగా గుర్తింపు కల్పించాలని కోరుతూ ఆ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ ఎన్నికల సంఘానికి వినతిపత్రం పంపించారు. పార్టీ రిజిస్ట్రేషన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చిన అభ్యంతరాలపై పూర్తి వివరాలు అందజేసి, తమ వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలని కోరారు.పార్టీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చినట్లు ఎన్నికల సంఘం పేర్కొన్న నేపథ్యంలో, వాటి కాపీలను తమకు అందజేయాలని అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అభ్యంతరాల వివరాలు తెలియకుండా వాటికి ఎలా సమాధానం చెప్పగలమని ప్రశ్నించారు. ముందుగా అభ్యంతరాల ప్రతులను అందజేసి, వాటిని పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని కోరారు.ఎన్నికల సంఘం తొలుత కేటాయించిన పేరుతోనే రాష్ట్రంలోని 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఏర్పాటు చేసి, విస్తృతంగా ప్రచారం నిర్వహించామని తెలిపారు. ఇప్పుడు అదే పేరును మార్చాలని చెప్పడం న్యాయసమ్మతం కాదని పేర్కొన్నారు. తెలంగాణలో ఒకే తరహా పేర్లతో ఇప్పటికే పలు రాజకీయ పార్టీలకు గుర్తింపు ఉన్నప్పటికీ, తమ పార్టీ పేరుపైనే అభ్యంతరాలు వ్యక్తం చేయడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు.అభ్యంతరాలను పరిశీలించి, వాటిపై తమ వివరణ ఇచ్చేందుకు తగిన గడువు కల్పించిన అనంతరమే వ్యక్తిగత విచారణకు పిలవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం తమ పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును పరిశీలించి, తెలంగాణ రక్షణ సేనకు అధికారిక గుర్తింపు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ముగిసిన TGCGTA ‘GO.MS. NO21’ విజయోత్సవ సభ

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**

TGCGTA హైదరాబాద్ మరియు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ‘GO.MS. NO–21’ విజయోత్సవ సభ ఆదివారం (12/07/2026) అత్యంత ఘనంగా ముగిసింది. ఉపాధ్యాయుల హక్కుల సాధన దిశగా సాధించిన విజయానికి గుర్తుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉదయం 11:00 గంటలకు ప్రారంభమైన ఈ మహాసభకు TGCGTA రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కదారు సురేందర్ రెడ్డి గారు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. గోపి గారు మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి సంఘ సభ్యులు టాప్ లెస్ వాహనంలో పుష్ప వర్షంతో ఘనంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతం అనంతరం రాష్ట్ర కార్యవర్గానికి వేదపండితులద్వార వేద ఆశీర్వచనం అందించారు.వేదికపై ఉన్న అతిథులు మరియు సభ్యులు సంఘ బలోపేతం, హక్కుల రక్షణపై ప్రసంగించారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం జరిగిన సమావేశంలో సభ్యుల సందేహాలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా TGCGTA రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కదారు సురేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ... "మన సంఘం – మన బలం" అనే నినాదంతో డిగ్రీ కళాశాలల అధ్యాపకుల హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడతామని స్పష్టం చేశారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమం ముగింపులో డాక్టర్ కదారు సురేందర్ రెడ్డి గారిని, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఏన్ . గోపి గారిని మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులను సంఘం తరపున ఘనంగా సత్కరించారు. TGCGTA హైదరాబాద్ జిల్లా కార్యదర్శి డా. పి.సత్యనారాయణ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్.క్రొత్త విద్యాసాగర్, డాక్టర్. ఇటిక్యాల పావని, డాక్టర్ భాస్కర్ రెడ్డి వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ మహా సభ అనంతరం వందన సమర్పణతో సభ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, వివిధ జిల్లాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి....టీయూటీఎఫ్

- సీపీఎస్ జన జాగరణ యాత్ర కు టీయూటీఎఫ్ మద్దతు




**సూర్యాపేట వెలుతురు జూలై 12:**

సూర్యాపేట జిల్లా లో ఈ నెల 13,14 తేదీల్లో జరిగే TSCPSEU జన జాగరణ యాత్ర పోస్టర్ ల ను TUTF రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దామెర శ్రీనివాస్ గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ అనేది ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్ అని ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన విధంగా దానిని అమలు చేయాలని అన్నారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి అరవింద్ కస్తూరి కిషన్ ప్రసాద్ లు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన,లోపభూయిష్టమైన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సూర్యాపేట జిల్లా లో టీయూటీఎఫ్ శ్రేణులు జన జాగరణ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం లో టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి గుయ్యని ప్రసాద్ లు పాల్గొన్నారు.

## అమరావతిపై విషం చిమ్ముతున్న వైసీపీ

- టీడీపీ నేత, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు
- రాజధానిని అడ్డుకోవడానికే కొందరు రైతులను జగన్ ఉపయోగిస్తున్నారని ఆరోపణ
- అరశాతం మంది రైతులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- 99.50 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని వెల్లడి
- రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకే వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని వ్యాఖ్య
- అమరావతిపై నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శ
- రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునే కుట్రలు కొనసాగుతున్నాయని ఆరోపణ
- రైతులపై ప్రేమతో కాకుండా రాజకీయ



**ప్రయోజనాల కోసమే అమరావతి అభివృద్ధిని అడ్డుకోవాలన్నదే జగన్ లక్ష్యమని ఆరోపణ**

**అమరావతి వెలుతురు జూలై 12:**

రాజధాని అమరావతిపై విషం చిమ్మడాన్ని వైసీపీ ఆపడం లేదని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం, అమరావతి రాజధానిపై ప్రజల్లో అపోహలు సృష్టించడమే వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు.అమరావతి నిర్మాణాన్ని అడ్డుకోవడానికే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొందరు రైతులను ఉపయోగిస్తున్నారని నక్కా ఆనందబాబు అన్నారు. రైతులపై ప్రేమతో కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ వ్యవహారం సాగుతోందని విమర్శించారు. రాజధాని కోసం భూములు ఇవ్వడానికి నిరాకరించిన అరశాతం మంది రైతులను అడ్డుపెట్టుకుని వైసీపీ కుతంత్ర రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.అమరావతి నిర్మాణం కోసం 99.50 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా తమ భూములను త్యాగం చేశారని ఆయన గుర్తు చేశారు. వేలాది మంది రైతులు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వానికి సహకరించారని, వారి త్యాగాలను విస్మరించి కొద్దిమంది పేరుతో మొత్తం రాజధాని ప్రాజెక్టును వ్యతిరేకించడం సరికాదన్నారు.రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడానికి, రాజధాని నిర్మాణాన్ని నిలువరించడానికి వైసీపీ అనేక ప్రయత్నాలు చేస్తోందని నక్కా ఆనందబాబు విమర్శించారు. అమరావతిపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాజధాని అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## జులై 23న ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ

- మాజీ సుప్రీం లీడర్ స్మారక సభకు ఏర్పాట్లు
- టెహ్రాన్‌లో సాయంత్రం జరిగే కార్యక్రమం
- కీలక నేతలంతా హాజరయ్యే అవకాశం
- తొలిసారి బహిరంగంగా కనిపించనున్న మొజ్తబా
- భద్రతతోనే ప్రజల ముందుకు రానున్న నేత
- తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉన్న మొజ్తబా
- దాడిలో గాయపడినట్లు ప్రచారం
- ఇరాన్‌పై దాడులను ఖండిస్తున్న సుప్రీం లీడర్
- ప్రతీకారం తీర్చుకుంటానన్న తాజా హెచ్చరిక
- ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న స్మారక సభ

**ఇరాన్ వెలుతురు జూలై 12:**

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ త్వరలో ప్రజల ముందుకు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జులై 23న టెహ్రాన్‌లో మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారక సభను ఆయన నిర్వహించనున్నట్లు సమాచారం. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి దేశంలోని కీలక రాజకీయ, మత నాయకులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొజ్తబా ఖమేనీ ఇప్పటివరకు బహిరంగంగా కనిపించలేదు. భద్రతా కారణాల దృష్ట్యా తన తండ్రి అంత్యక్రియలకు కూడా ఆయన హాజరుకాలేదని సమాచారం. అలాగే రెండు వారాల క్రితం జరిగిన తన భార్య అంత్యక్రియల్లోనూ ఆయన కనిపించలేదు.మొజ్తబా ఖమేనీకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒకరు ఫిబ్రవరి 28న జరిగిన దాడుల్లో మరణించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అదే దాడిలో మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడగా చికిత్స



పొందుతున్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఇరాన్‌పై జరిగిన దాడులను ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా ఖండిస్తూ వస్తున్నారు.తాజాగా శనివారం చేసిన సోషల్ మీడియా పోస్టులో తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో జులై 23న జరగనున్న స్మారక సభపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

## ఒమన్ తీరంలో వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి, భారతీయుడు గల్లంతు

- హర్మూజ్ జలసంధిలో జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌకపై దాడి
- నౌకలో ఉన్న 11 మంది భారతీయుల్లో 10 మంది సురక్షితం
- ఒక భారతీయుడి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- దాడిని తీవ్రంగా ఖండించిన భారత ప్రభుత్వం
- ఒమన్ అధికారులతో కలిసి సహాయక చర్యలు చేపట్టిన భారత దౌత్య కార్యాలయం
- దాడితో నౌక ఇంజిన్ రూమ్‌కు తీవ్ర నష్టం
- మంటలు చెలరేగడంతో లైఫ్‌బోట్‌లో బయటపడ్డ సిబ్బంది
- హర్మూజ్ జలసంధిలో మళ్లీ పెరిగిన ఉద్రిక్తత

సముద్ర భద్రతపై అంతర్జాతీయ ఆందోళన




**ఇరాన్‌పై అమెరికా దాడులతో మరింత ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు**

**ఒమన్ వెలుతురు జూలై 12:**

ఒమన్ తీరం సమీపంలోని హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న సైప్రస్ జెండాతో కూడిన వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఇరాన్ దాడి చేయడంతో ఒక భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. నౌకలో మొత్తం 11 మంది భారతీయులు ఉండగా, వారిలో 10 మందిని సురక్షితంగా రక్షించినట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. గల్లంతైన మరో భారతీయుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఈ ఘటనపై భారత విదేశాంగశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. వాణిజ్య నౌకపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. ఒమన్‌లోని భారత దౌత్య కార్యాలయం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, గాలింపు చర్యల్లో ఒమన్ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటోందని తెలిపింది. సహాయక చర్యల్లో సహకరిస్తున్న ఒమన్ ప్రభుత్వానికి భారత ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది.దాడి కారణంగా జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌకలో భారీ అగ్నిప్రమాదం సంభవించినట్లు సమాచారం. ముఖ్యంగా ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతినడంతో నౌకను కొనసాగించడం సాధ్యం కాకపోయింది. మంటలు వేగంగా వ్యాపించడంతో సిబ్బంది నౌకను విడిచిపెట్టి లైఫ్‌బోట్‌లో సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు.ఈ ఘటనతో ప్రపంచంలో అత్యంత కీలక సముద్ర వాణిజ్య మార్గాల్లో ఒకటైన హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మార్గం గుండా భారీ ఎత్తున చమురు, వాణిజ్య రవాణా జరుగుతుండటంతో అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది.ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని 140 లక్ష్యాలపై అమెరికా దాడులు నిర్వహించిన నేపథ్యంలో ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్య ప్రాంతంలో భద్రతా పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారుతున్నాయి.

# గాన కోకిల ఎస్. జానకమ్మ కన్నుమూత

**అనారోగ్యంతో కన్నుమూత**



విఖ్యాత గాయని ఎస్.జానకి (88) శనివారం తుదిశ్వాస విడిచారు. శ్వాస సంబంధ సమస్యలతో కర్ణాటకలోని మైసూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతున్న జానకి శనివారం రాత్రి మృతి చెందినట్లు ఆమె మనవరాలు అప్సర విద్యుల వెల్లడించారు. ''ప్రేమ, ఆప్యాయతలు పంచే కుటుంబ సభ్యుల మధ్య నాయనమ్మ ప్రశాంతంగా కన్నుమూశారు. ఈ సంఘటనతో మా హృదయాలు బరువెక్కినా ఆమె అద్భుతమైన సంగీత ప్రయాణంలో కాలానికి అతీతమైన గీతాలను మిగిల్చి వెళ్లారు. ఆమె వైవిధ్య స్వరంతో పాడిన పాటలు లెక్కలేనన్ని మధుర స్మృతులను మిగిల్చాయి. మానవత్వం, దయాగుణం, గొప్ప వ్యక్తిత్వాన్ని మాకు విడిచి వెళ్లారు. ఈ కష్ట సమయంలో మా కుటుంబ ఏకాంతతను గౌరవించాలని ప్రార్థిస్తున్నాం'' అని అప్సర సామాజిక మాధ్యమం ద్వారా విజ్ఞప్తి చేశారు. వయోభారంతో బాధపడుతున్నా ఆరోగ్యపరమైన సమస్యలు అంతగా లేని జానకి రెండు వారాల క్రితమే మంగళూరులోని మంగళాదేవి దేవాలయాన్ని సందర్శించారు. ఈ ప్రయాణ సమయంలో శ్వాససంబంధ సమస్యలు ఎదురవడంతో మైసూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అనంతరం ఇంటికి వెళ్లారు. మళ్లీ గతవారం కాలికి ఇన్ఫెక్షన్ కారణంగా చికిత్స కోసం మళ్లీ ఆసుపత్రిలో చేరారు. శనివారం రాత్రి 7:30 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు వైద్య బృందం వెల్లడించింది. జానకి భర్త వి.రామ ప్రసాద్ 1997లో మరణించగా, ఏకైక కుమారుడు మురళీకృష్ణ ఈ ఏడాది జనవరిలో మృతి చెందారు.

# 'లెనిన్'తో అఖిల్‌కు సరైన విజయం దక్కింది: నాగార్జున



''అనుకున్నది సాధించాలనే తపన అఖిల్‌లో చిన్నప్పటి నుంచీ ఉంది. ఎంతో ఉత్సాహంగా ఉంటాడు. ప్రతి సినిమాకీ ఎంతో కష్టపడుతూ, వందశాతం న్యాయం చేస్తాడు. కానీ విజయానికి అడుగు దూరంలో నిలిచిపోయేవాడు. 'లెనిన్'తో తనకు సరైన విజయం దక్కింది'' అన్నారు అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున. ఆయన, సూర్యదేవర నాగవంశీ కలిసి నిర్మించిన 'లెనిన్' విజయోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అఖిల్ అక్కినేని కథానాయకుడిగా, మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలో అక్కినేని నాగార్జున తన తనయుడు కథానాయకుడిగా విజయం అందుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఉత్సాహంగా మాట్లాడారు. ''ఏడాది కిందట 'తండేల్' విజయోత్సవానికి హాజరయ్యా. ఇప్పుడు 'లెనిన్' వేడుకకి వచ్చా. చైతన్య, అఖిల్ నాకు రెండు కళ్లతో సమానం. ఆ ఇద్దరి విజయం కోసం అభిమానులు ఎదురు చూస్తుంటారు. 'తండేల్' వచ్చినప్పుడు కాలర్ ఎగరేశారు, ఇప్పుడు 'లెనిన్' విజయంపైనా అంతే సంతోషంగా ఉన్నారు. ఈ సినిమాకి వాయిస్ ఇచ్చిన తారక్ (ఎన్టీఆర్) మా పెద్దబ్బాయి. తనకు కృతజ్ఞతలు'' అన్నారు నాగార్జున. అఖిల్ అక్కినేని మాట్లాడుతూ ''నా గత చిత్రాల్ని మరిచిపోయి 'లెనిన్'ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర నాగవంశీ, భాగ్యశ్రీ బోర్సేతో పాటు చిత్రబృందం పాల్గొంది.

# కెరీర్, వివాహ జీవితాల అద్భుత బ్యాలెన్స్



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉండగానే తన ప్రియుడు, టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండను వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా గ్లామర్ ఫీల్డ్‌లో పెళ్లి కెరీర్‌కు అడ్డు అని భావిస్తారు, కానీ రష్మిక మాత్రం పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌లను అద్భుతంగా బ్యాలెన్స్ చేస్తూ దూసుకుపోతోంది.

గతేడాది వరుసగా ఐదు భారీ చిత్రాలతో అలరించిన రష్మిక, ఈ ఏడాది బాలీవుడ్ మూవీ 'కాక్‌టెయిల్–2'తో మెప్పించింది. ప్రస్తుతం ఆమె చేతిలో క్రేజీ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి:

రణబాలి: భర్త విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న ఈ భారీ అంచనాల చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది.

మైసా: ట్రైబల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ పీరియడ్ యాక్షన్ చిత్రం కోసం రష్మిక చేసిన రిస్కీ అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రబృందాన్ని సైతం ఫిదా చేసింది.

సౌత్ నుంచి నార్త్ వరకు ఎన్నో ఆఫర్లు వస్తున్నప్పటికీ, రష్మిక కొత్త సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చినట్లు ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తోంది. తన వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించేందుకే ఆమె ఈ నిర్ణయం తీసుకుందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# ఇంగ్లాండ్ టెస్ట్ కోచ్ పదవికి బ్రెండన్ మెకల్లమ్ రాజీనామా




ఇంగ్లాండ్ క్రికెట్‌లో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించిన కొద్ది రోజుల వ్యవధిలోనే, ఇంగ్లాండ్ పురుషుల టెస్ట్ జట్టు ప్రధాన కోచ్ పదవి నుండి బ్రెండన్ మెకల్లమ్ తప్పుకుంటున్నట్లు ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆదివారం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఆయన పరిమిత ఓవర్ల (వన్డే, టీ20) ఫార్మాట్‌లకు హెడ్ కోచ్‌గా కొనసాగుతారని బోర్డు స్పష్టం చేసింది. నైట్‌క్లబ్ గొడవ, ఆపై ఒక టెస్ట్ మ్యాచ్ నిషేధం అనంతరం బెన్ స్టోక్స్ రిటైర్ అవ్వడం, ఇప్పుడు మెకల్లమ్ టెస్ట్ బాధ్యతల నుండి తప్పుకోవడం ఇంగ్లీష్ క్రికెట్‌లో చర్చనీయాంశంగా మారింది.

టెస్ట్ కోచ్ పదవి నుండి వైదొలగడంపై మెకల్లమ్ తీవ్ర నిరాశ వ్యక్తం చేశాడు. ఇది ఆయన స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయం కంటే, బోర్డే ఆయన్ను తొలగించినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. "టెస్ట్ కోచ్‌గా కొనసాగనందుకు చాలా బాధగా ఉంది, కానీ బోర్డు నిర్ణయాన్ని గౌరవిస్తాను. ఇకపై నా పూర్తి దృష్టిని పరిమిత ఓవర్ల జట్లపై కేంద్రీకరించి ఇంగ్లాండ్ క్రికెట్ ముందుకు సాగడానికి నా వంతు కృషి చేస్తాను" అని న్యూజిలాండ్ మాజీ ఓపెనర్ మెకల్లమ్ పేర్కొన్నాడు. మెకల్లమ్ నాలుగు ఏళ్ల పదవీకాలంలో ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెట్‌లో 'బజ్‌బాల్' శైలితో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను ఇంగ్లాండ్ 1–2తో కోల్పోవడంతో యాషెస్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేసినట్లు ఈసీబీ సీఈవో రిచర్డ్ గౌల్డ్ తెలిపారు. కాగా, మెకల్లమ్ ఆధ్వర్యంలోనే ఇంగ్లాండ్ టీ20 జట్టు ఇటీవల భారత్‌ను 4–0తో క్లీన్‌స్వీప్ చేసి ప్రపంచ నంబర్ వన్ ర్యాంకును కైవసం చేసుకుంది. రాబోయే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరగబోయే మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ సమయానికి ఇంగ్లాండ్ కొత్త టెస్ట్ కోచ్‌ను నియమించనుంది.

# ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు డబుల్ షాక్

**హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి అవుట్**




భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జూలై 14 నుండి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ముందు భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. టీమిండియా ఆటగాళ్లు హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి గాయాల కారణంగా సిరీస్‌లకు దూరమయ్యారు. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో వీరిద్దరూ హ్యామ్‌స్ట్రింగ్ గాయాల బారిన పడ్డారు. స్కాన్ల అనంతరం హర్షిత్‌కు గ్రేడ్ 1, వరుణ్‌కు గ్రేడ్ 2 హ్యామ్‌స్ట్రింగ్ గాయాలు ఉన్నట్లు తేలడంతో వీరిద్దరినీ తదుపరి చికిత్స నిమిత్తం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో వీరి స్థానాల్లో రిప్లేస్‌మెంట్లను బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్ కోసం హర్షిత్ రాణా స్థానంలో ఆల్‌రౌండర్ ప్రిన్స్ యాదవ్‌ను జట్టులోకి తీసుకున్నారు. అలాగే, జింబాబ్వే పర్యటనకు ప్రకటించిన టీ20 జట్టు నుండి వరుణ్ చక్రవర్తి తప్పుకోవడంతో అతని స్థానంలో స్పిన్నర్ రవి బిష్ణోయిని ఎంపిక చేశారు. ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 0–4తో దారుణంగా కోల్పోయిన నేపథ్యంలో, జూలై 14న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగబోయే తొలి వన్డేతోనైనా పుంజుకోవాలని టీమిండియా భావిస్తోంది.

ఈ వన్డే సిరీస్ కోసం సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు జట్టులోకి తిరిగి రావడం భారత జట్టుకు కొండంత బలాన్ని ఇస్తోంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత వన్డే జట్టు జూలై 14, 16, 19 తేదీల్లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది. టి20 సిరీస్ పరాజయం తర్వాత కనీసం వన్డే సిరీస్‌నైనా కైవసం చేసుకుని పరువు నిలుపుకోవాలని మేనేజ్‌మెంట్ గట్టి పట్టుదలతో ఉంది.

# లార్డ్స్ టెస్టులో టీమిండియా సరికొత్త చరిత్ర






## క్రాంతి గౌడ్ ఐదు వికెట్ల సునామీ.. యాస్తికా భాటియా సెంచరీ రికార్డు!

లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఏకైక మహిళల టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు సరికొత్త రికార్డులతో చరిత్ర సృష్టించింది. ఒకే మ్యాచ్‌లో ఇద్దరు భారత ఆటగాళ్లు కనబరిచిన అసాధారణ ప్రదర్శనతో టీమిండియా ఈ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. మొదట బౌలింగ్‌లో 22 ఏళ్ల యువ పేసర్ క్రాంతి గౌడ్ ఐదు వికెట్లతో చెలరేగగా, ఆపై బ్యాటింగ్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ యాస్తికా భాటియా అద్భుత శతకంతో సంచలనం సృష్టించారు. దీంతో ఇంగ్లాండ్ ముందు భారత్ 457 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేయగా, అనంతరం ఇంగ్లాండ్‌ను కేవలం 170 పరుగులకే ఆలౌట్ చేయడంలో క్రాంతి గౌడ్ కీలక పాత్ర పోషించారు. టామీ బ్యూమాంట్, క్యాప్సే, కెప్టెన్ సీవర్–బ్రంట్ లాంటి కీలక వికెట్లతో సహా 5 వికెట్లు పడగొట్టి లార్డ్స్ టెస్ట్ ఆనర్స్ బోర్డుపై చోటు సంపాదించిన తొలి మహిళా క్రికెటర్‌గా క్రాంతి నిలిచారు. 2006లో జులన్ గోస్వామి తర్వాత ఇంగ్లాండ్ గడ్డపై ఐదు వికెట్లు తీసిన భారత మహిళా పేసర్‌గా రికార్డు సృష్టించారు. క్రాంతి సాధించిన ఈ చారిత్రాత్మక విజయంపై ఆమె కోచ్ రాజీవ్ బిల్థారే తీవ్ర భావోద్వేగానికి గురవుతూ, తన ఆనందానికి అవధులు లేవని కొనియాడారు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 341/7 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఎడమచేతి వాటం బ్యాటర్ యాస్తికా భాటియా (113 పరుగులు, 14 ఫోర్లు) బాధ్యతాయుతమైన ఆటతీరుతో లార్డ్స్ మైదానంలో టెస్ట్ సెంచరీ చేసిన ప్రపంచపు తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డులకెక్కారు. ఆమెకు తోడుగా స్మృతి మంధాన (70), ఆఖర్లో రిచా ఘోష్ (50 నాటౌట్) రాణించడంతో భారత్ ఇంగ్లాండ్‌కు నాలుగు సెషన్లలో 457 పరుగుల అసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇంగ్లాండ్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 5 వికెట్లు పడగొట్టారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టును కట్టడి చేస్తూ భారత్ చారిత్రక విజయం దిశగా దూసుకుపోతోంది.


ఏలెత్తి
చూపుతాం...
తప్పు
ఎవడిది అయినా...!
గల్లా పట్టి
గుంజుతాం...
అన్యాయాన్ని
అడుగుతాం...!
నిజం కోసం...
నిరంతరం...!
రేఖ బోయలపల్లి
వైస్ ప్రెసిడెంట్
తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

# ఎంత వేగంగా వెళ్లినా రైలు పట్టాలపై ఎందుకు జారిపోదు.? దీని వెనుక ఉన్న సైన్స్ ఏంటంటే.?

రైలులో ప్రయాణించే సమయంలో చాలా మందికి ఒక సందేహం వస్తుంది. ఇనుప పట్టాలు చాలా స్మూత్‌గా ఉంటాయి. రైలు చక్రాలు కూడా ఇనుపతోనే తయారవుతాయి. అలాంటప్పుడు గంటకు ఎంత వేగంగా వెళ్లినా రైలు పట్టాలపై ఎందుకు జారిపోదనే సందేహం ఎప్పుడైనా వచ్చిందా.?

రైలు జారిపోకుండా ఉంచేది ఫ్రిక్షన్ శక్తే

సాధారణంగా ఏ వస్తువైనా కదలడానికి లేదా ఆగడానికి ఫ్రిక్షన్ (ఘర్షణ) కీలక పాత్ర పోషిస్తుంది. రైలు చక్రాలు, పట్టాల మధ్య కూడా కొంతమేర ఘర్షణ శక్తి ఉంటుంది. అదే రైలును ముందుకు నడిపించడంతో పాటు చక్రాలు ఖాళీగా తిరగకుండా అడ్డుకుంటుంది. రైలు చక్రాలు పూర్తిగా స్మూత్‌గా కనిపించినా వాటి ఉపరితలం, పట్టాల నిర్మాణం ఇలా రెండింటినీ శాస్త్రీయంగా రూపొందిస్తారు. దీంతో తగినంత గ్రిప్ ఏర్పడి రైలు సురక్షితంగా ప్రయాణిస్తుంది.

కారు టైర్లకు, రైలు చక్రాలకు ఉన్న తేడా ఇదే

కార్లు, బైక్‌లు రబ్బరు టైర్లతో నడుస్తాయి. అందుకే వాటిపై ప్రత్యేక గ్రిప్ డిజైన్ ఉంటుంది. రోడ్డును బలంగా పట్టుకునేలా ఆ టైర్లను తయారు చేస్తారు. అయితే రైలు మాత్రం ఇనుప చక్రాలపైనే నడుస్తుంది. రైలు చక్రాలు పూర్తిగా ఫ్లాట్‌గా ఉండవు. వాటి ఆకారం కొద్దిగా శంఖాకారంగా (Conical Shape) ఉంటుంది. ఈ ప్రత్యేక రూపకల్పన వల్ల రైలు పట్టాలపై స్థిరంగా ప్రయాణిస్తుంది. అంతేకాదు, మలుపుల్లో కూడా చక్రాలు సులభంగా తిరిగేలా ఈ డిజైన్ సహాయపడుతుంది.

వర్షంలో రైలు వేగం ఎందుకు తగ్గిస్తారు?

వర్షం పడినప్పుడు పట్టాలపై నీటి పొర ఏర్పడుతుంది. దీంతో చక్రాలు, పట్టాల మధ్య ఉండే ఘర్షణ శక్తి తగ్గుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రైలు అదే వేగంతో వెళ్తే చక్రాలు జారిపోయే అవకాశం ఉంటుంది. అందుకే వర్షాకాలంలో కొన్ని ప్రాంతాల్లో రైళ్ల వేగాన్ని తగ్గిస్తారు. ముఖ్యంగా బ్రేకింగ్ దూరం పెరిగే అవకాశం ఉండటంతో భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటారు.

రైలు ఇంజిన్‌లో ఉండే శాండ్ బాక్స్ ఏం చేస్తుంది?


చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే, ప్రతి రైలు ఇంజిన్‌లో శాండ్ బాక్స్ అనే ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. చక్రాలు పట్టాలపై జారిపోతున్నట్లు గుర్తిస్తే, ఈ వ్యవస్థ చక్రాల ముందు భాగంలో కొద్దిగా ఇసుకను వేస్తుంది. ఇసుక వల్ల ఘర్షణ శక్తి పెరిగి చక్రాలకు మంచి గ్రిప్ లభిస్తుంది. దీంతో రైలు మళ్లీ సాధారణంగా కదలడం ప్రారంభిస్తుంది. ముఖ్యంగా వర్షం, మంచు లేదా తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుంది.

రైలు పట్టాలు తప్పడానికి కారణం చక్రాలు జారిపోవడం కాదు

చాలామంది రైలు ప్రమాదాలు చక్రాలు జారిపోవడం వల్లే జరుగుతాయని అనుకుంటారు. కానీ వాస్తవానికి చాలా ప్రమాదాలకు ఇతర కారణాలే ఉంటాయి. పట్టాల దెబ్బతినడం, సిగ్నల్ లోపాలు, యాంత్రిక సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర సాంకేతిక లోపాల వల్ల రైలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో రైలు చక్రాలు కేవలం జారిపోవడం వల్ల పట్టాలు తప్పడం చాలా అరుదు. రైల్వే ఇంజినీర్లు చక్రాల ఆకారం నుంచి పట్టాల నిర్మాణం వరకు ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా రూపొందిస్తారు. అందుకే రోజూ వేలాది రైళ్లు అధిక వేగంతో



ప్రయాణించినా సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయి.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com